

ఒకనాడు ఓటుకు వెయ్యి అంటే అమ్మో అనే వారు.. మరిప్పుడో.. వైసీపీ అభ్యర్థులు ఓటుకు రూ.2500 ఇస్తారట.. ఇదీ జనం మాట.. అంత డబ్బు ఎక్కడ నుంచి వచ్చింది..! డబ్బులు ఎక్కడైనా చెట్టుకు కాస్తాయా? సంపాదిస్తే వస్తోంది.. ఐదేళ్లలో ఒక అభ్యర్థి ఓటుకు రూ.2500 ఇచ్చేలా ఎలా సంపాదించగలడంటారా!? ఇది జనమెరిగిన సత్యమే.. ఊహకు అందదు.. అంచనాలకు చిక్కదు.. ఐదేళ్లూ అందిన కాడికి తవ్వేశారు.. నేటికీ తవ్వుతూనే ఉన్నారు.. సాగని దందా లేదు.. జరగని అవినీతి లేదు..కొండలూ మాయం చేసేశారు. గోదారిని కుళ్లబొడిచేశారు. వంతెనల చెంత గుల్లగుల్ల చేసేశారు.. ఏటిగట్లూ లేపేశారు.. అఖండ దోపిడీకి అంతే లేదు.. ఐదేళ్లలో గోదావరి రూపురేఖలనే మార్చేశారు... ఎంతలా అంటే గోదావరిలో ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గోతులే..ఆ గోతుల్లో పడి చనిపోయినవారెందరో... అయినా అడ్డూ అదుపూ లేదు.. అడిగేవాడూ లేడు.. సీఎంకే ఎదురెళ్లే వాడెవడుంటాడు.. అధికారులు కిమ్మనడం లేదు.. ఇదీ గోదావరి జిల్లాల్లో జగనాసుర ఇసుక చరిత్ర.. సాక్షాత్తూ మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడే చూసి ఆశ్చర్యపోయేటంత ఇసుకను దోచేశారు.. మట్టినీ వదల్లేదు.. జగన్ ఒక్క చాన్స్ అంటే జనం అధికారమిచ్చారు.. ఐదేళ్లూ అంతా వాళ్లిష్టం..!? ఏది దొరికితే అది మింగేశారు.



ఇలా చేస్తే వంతెనలు ఉంటాయా : రాజమహేంద్రవరం ఆర్చ్ బ్రిడ్జి దగ్గరలో గోదావరిలో ఇసుక డ్రెడ్జింగ్



రావులపాలెం ఇసుక ర్యాంపులో తవ్వకాలు

జగన్నేతలు.. మహా మేతలు!

కాకినాడలో చెరువులు.. కొండలు ఖాళీ

పిఠాపురం, ఏప్రిల్ 24: అధికారం చేతిలో ఉంది అడిగేవాళ్లెవరు. అంతా వాళ్లిష్టమే.. ఇళ్ల స్థలాల లెవెలింగ్, ప్రభుత్వ పనుల మాటున చెరువులను అడ్డగోలుగా తవ్వేసి కొల్లగొట్టేశారు. కాకినాడ జిల్లాలోని తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో పోలవరం, పుష్కర కాలువల తవ్వకాల్లో వచ్చిన గ్రావెల్‌ను గట్లుగా వేశారు. కోట్లాది రూపాయలు విలువైన ఈ గ్రావెల్‌పై ఆయా నియోజకవర్గాల్లోని వైసీపీ నేతల కన్ను పడింది. చెరువులు, కొండలు, పోలవరం, పుష్కర కాలువల గట్లు ఇలా ఏది కనిపిస్తే వాటిపై రాబందుల్లా వాలిపోయారు. ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా తవ్వేశారు. మట్టి, గ్రావెల్ తరలించేసి కోట్లు గడించారు. ఇళ్లస్థలాల ముసుగులో గట్లను కరిగించేశారు. పోలవరం ఇరిగేషన్ అధికారులు ఈ అక్రమ తవ్వకాలపై పలు మార్లు పోలీసులకు ఫిర్యాదులు చేసినా కనీసం కేసులు నమోదు చేయలేదు. కాకినాడ జిల్లా కేంద్రానికి చెందిన ఒక కీలక నేత ఈ తవ్వకాల్లో వేయి కోట్లకు పైగా వెనుకేసుకున్నారు. ప్రత్తిపాడు, పిఠాపురం సహా మెట్ట నియోజకవర్గాల్లో కొండలు కరిగిపోయాయి. గ్రావెల్‌ను అక్రమంగా తరలించేశారు.

ఒకే ఒక్కడు.. రూ.1800 కోట్లు

జిల్లా కేంద్రమైన కాకినాడకు చెందిన వైసీపీ కీలక నేత, ఆయన అనుచరులు జిల్లాలో మట్టి, గ్రావెల్ తవ్వకాల్లో పేట్రేగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వ కీలక నేత అండదండలు పుష్కలంగా ఉండడంతో అడ్డే లేకుండా పోయింది. ఈ ఒక్క నేత మట్టి, గ్రావెల్ సంపాదనే ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు.

- పెద్దాపురం మండలం రామేశంమెట్టలో వందలాది ఎకరాల్లో వీరు అడ్డగోలుగా తవ్వేశారు. ఇళ్ల స్థలాల లెవెలింగ్ పేరుతో అనుమతి తెచ్చుకుని ఐదేళ్ల పాటు ఇష్టారాజ్యంగా గ్రావెల్‌ను తరలించి కోట్లు కొల్లగొట్టేశారు. ఈ ఒక్క తవ్వకాల్లోనే కాకినాడ కీలక ప్రజాప్రతినిధి, ఆయన అనుచరులు రూ.800 కోట్లు మేర వెనుకేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.
- పిఠాపురం నియోజకవర్గ పరిధిలోనే కాకినాడ కీలక నేత కనుసన్నల్లో చెరువులను అడ్డగోలుగా తవ్వేశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో 100 ఎకరాల విస్తీర్ణంలోని కోదండరాముడి చెరువు, చేబ్రోలులోని కోటలంకవారి చెరువు, పిఠాపురం మండలం కుమారపురం, జల్లూరు శివారులోని చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వేసి తరలించేశారు. తాటిపర్తి, చేబ్రోలు చెరువులో 20 నుంచి 40 అడుగుల మేర గోతులు పెట్టి అడ్డగోలుగా తవ్వకాలు నిర్వహించడంపై ఆయా గ్రామస్థులు, రైతులు ఆందోళనలు చేశారు. తాటిపర్తి చెరువుల్లో గోతుల్లో పడి ఇద్దరు మరణించారు. చేబ్రోలు చెరువులో అడ్డగోలు తవ్వకాలపై అక్కడి రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో తవ్వకాలపై స్టే విధించింది. తాటిపర్తి చెరువులో మాత్రం స్థానికుల ఆందోళనలు తోసిరాజని తవ్వకాలు సాగించారు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు తవ్వకాలను నిలిపివేసింది. దుర్గాడ, చెందుర్తి, సామర్లకోట మండలంలోని చెరువుల్లో తవ్వకాలు జరిగాయి. మట్టి, గ్రావెల్‌ను భారీగా తరలించేశారు.

మట్టి, చెట్లు, కాల్వగట్లు అన్నీ దోపిడీయేనా



అధికారుల తీరు చూస్తుంటే మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నట్టు ఉంది. కాల్వ గట్లు తవ్వి మట్టిని అమ్ముకుంటున్నా నిద్రావస్థలో ఉన్న అధికారులకు పట్టదు. చిత్తశుద్ధి ఉంటే తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శిక్షించాలి.
- గన్నమని సత్యనారాయణ, రైతు, దేవరపల్లి

తూర్పున గోదారంతా దోపిడీయే..

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం రూరల్/కొవ్వూరు/తాళ్లపూడి, ఏప్రిల్ 24: గోదారంతా అఖండ దోపిడీ సాగుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గోదారిలో ఇష్టానుసారంగా తవ్వేశారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక ర్యాంపులను జేపీ కాంట్రాక్టు సంస్థకు ఇచ్చినట్టు చెప్పి గతేడాది మే నుంచి డిసెంబరకు వరకు అనధికారికంగా తవ్వేసి కోట్లు దోచేసింది.తర్వాత మరోసంస్థను తెరపైకి తెచ్చి ఏకంగా బ్యారేజీ నుంచి గామన్ బ్రిడ్జి అవతలి వరకూ యథేచ్ఛగా డ్రెడ్జింగ్ చేసేస్తున్నారు. దీంతో గోదావరిపై ఉన్న రోడ్ కం రైలు వంతెన, గామన్, రైల్వే ఆర్చ్ బ్రిడ్జిలకు ముప్పు వాటిల్లనుంది. వైసీపీకి చెందిన ఒక వ్యక్తికి అఖండ గోదావరిని అప్పగించి నెలకు రూ.30 కోట్ల వరకూ కప్పం కట్టించు కుంటున్నట్టు ఆరోపణలున్నాయి.అంతకు ముందు కొవ్వూరులో ఇదే తరహా వ్యవహారం లో ప్రేమ్‌రాజ్ అనే కాంట్రాక్టర్ నెలకు రూ.30 కోట్లు కట్టలేక, ఒత్తిళ్లు తట్టుకోలేక రైలు పట్టాల పై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. అయినా దోపిడీ ఆగలేదు.బోట్స్ మన్ సొసైటీల నిర్వహించాల్సిన ర్యాంపులను స్వాధీనం చేసుకుని అక్రమ డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఓపెన్ రీచ్‌ల్లో సీతానగరం,తాళ్లపూడి, కడియం, కొవ్వూరు, పెరవలి, నిడద వోలు మండలాల పరిధిలో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. రాజమహేంద్రవరం పరిధిలో గాయత్రి, కోటిలింగాలు, కాతేరు, వెంకటనగర్ ప్రాంతాల్లో దోపిడీకి అంతేలేదు. వైసీపీ నేతల ఒత్తిళ్లకు లొంగి అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 15 కిలోమీటర్ల మేర 30 ర్యాంపులు ఉన్నాయంటే ఎంత దారుణంగా గోదారిని కొల్లగొడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్తు హోం మంత్రి ఆదేశాలున్నాయంటూ అధికారపార్టీ నేతలు రేయింబవళ్లు యథేచ్ఛగా గోదావరి లంకల్లో ఉన్న ఇసుక, మట్టిని దోచుకుంటున్నారు. ఇటీవల కొవ్వూరు జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి నేరుగా కుమారదేవం ర్యాంపులో అక్రమంగా తరలిస్తున్న మట్టి లారీలను అడ్డుకున్నారు. తాళ్లపూడి మండలం బల్లిపాడు ఇసుక ఓపెన్ రీచ్‌లోనూ ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తు న్నారు. గోపాలపురం మండలం రాజంపాలెం పరిధిలోని దేవరకొండ గ్రావెల్ పుష్కలంగా లభించడంతో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా ఎక్స్‌కవేటర్లతో తవ్వి ట్రాక్టర్లపై తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదేళ్లూ మింగుడే

- అక్రమంగా వేల కోట్ల దోపిడీ
- ఎక్కడికక్కడ కొండలు మాయం
- ఇసుక లేకుండా గోదావరి ఖాళీ
- నేటికీ సాగుతున్న డ్రెడ్జింగ్
- ఏటిగట్లు..పోలవరం గట్లు కొట్టివేత
- ఉమ్మడి జిల్లాలో వైసీపీ దందా
- కన్నెత్తి చూడలేని అధికారులు
- ఎవరైనా వెళితే ఇక అంతే..
- అదే డబ్బుతో నేడు ఓటర్లకు గేలం




ఇక్కడ ఒకప్పుడు కొండ ఉండేదట : దాదాపుగా మాయమైన కొడవలి కొండ

కొడవలి కొండ మాయం..

గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో 370 ఎకరాల్లో విస్తరించి ఉన్న దనందిబ్బను(కొడవలి కొండ) తవ్వుకునేందుకు అనుమతులు మంజూరు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పెద్ద మంత్రి అనుచరులు ఇందులో కీలక పాత్ర పోషించారు. ఇక్కడ ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్న పేదల అభ్యంతరాలు తోసిరాజని అనుమతులిచ్చేయడం గమనార్హం. ఇక్కడే అతి ప్రాచీనమైన బౌద్ధారామం ఉంది. తవ్వకాల వల్ల బౌద్ధ ఆరామానికి నష్టం జరుగుతుందని పురావస్తుశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసినా, బౌద్ధ భిక్షువులు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. కీలక నేత అనుచరులకు స్థానిక వైసీపీ నేతలు సహకారం అందించడంతో కొడవలి కొండపై తవ్వకాలు సాగించారు. చివరకు కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేసింది.

అక్రమాల గుట్టువిప్పుతా..!



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక కొండ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు (ఫైల్)

కోనసీమంతా కొల్లగొట్టేశారు..

అమలాపురం-ఆంధ్రజ్యోతి/మండపేట/ఆత్రేయపురం/ఆలమూరు/కొత్తపేట/రావులపాలెం, ఏప్రిల్ 24: గోదారంతా దోపిడీ.. ఎక్కడా అడ్డులేదు.. అదుపూ లేదు.. గత ఐదేళ్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ పరిధిలోని గోదావరి నదీ పాయల్లో వందల కోట్ల విలువైన ఇసుక, మట్టి కొల్లగొట్టుకుపోయారు. ఈ అక్రమ దందాలో వైసీపీ ఎమ్మెల్యేలు కీలక భాగస్వాములు. ప్రధానంగా కొత్తపేట నియోజకవర్గ కేంద్రంగా వేల కోట్ల విలువైన ఇసుక, మట్టిని అనుమతులు లేకుండా తరలించుకుపోయారు. గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధ గౌతమి నదీ పాయలతో పాటు బంగాళాఖాతం సముద్ర తీరం వెంబడి ఉన్న సముద్రపు ఇసుకను సైతం కొల్లగొట్టేశారు. లంకల్లో మట్టి అయితే ప్రభుత్వ ఇళ్ల స్థలాల మెరక పేరుతో అనుమతులు పొంది ప్రైవేటు లేఅవుట్లకు తరలించి కోట్లు దోచేశారు. ప్రభుత్వానికి నామమాత్రపు ఆదాయమే చూపించేవారు. ఇందుకు కలెక్టర్ స్థాయి నుంచి వివిధ శాఖల అధికారులు సైతం వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు. ఆత్రేయపురం, రావులపాలెం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం, అల్లవరం, ఐ.పోలవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం తదితర మండలాల్లో నదీ పరీవాహక ప్రాంతాల్లో నిత్యం అక్రమ ఇసుక దందాలు నేటికీ కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారిక అనుమతులతో ప్రమేయం లేకుండా రావులపాలేనికి చెందిన ఒక కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు మట్టి, ఇసుక తరలింపు ద్వారా నెలనెలా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయంలో అధికార వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలకు భారీగా ముడుపులు ముడుతున్నాయి. జిల్లాలో ఐదేళ్లలో వెయ్యి కోట్ల పైబడి ఆదాయాన్ని ఇసుక, మట్టి మాఫియా అక్రమార్కులు ఆర్జించారనే ఆరోపణలున్నాయి. ఇసుక తవ్వకాలపై జిల్లా అధికారుల నిర్లక్ష్యంపై న్యాయస్థానాల్లో స్థానికులు ఫిర్యాదు చేశారు. పర్యావరణ అనుమతులు లేకుండా ర్యాంపులకు అనుమతులిచ్చిన తీరుపై ఎన్జీటీలో కూడా కేసు కొనసాగుతోంది. ఎర్ర గ్రావెల్ కొండలు వైసీపీ పాలనలో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. మండపేట మండలం ద్వారపూడి, కేశవరం, అనపర్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలతో పాటు రాజానగరం మండలంలో ప్రభుత్వ భూములే లక్ష్యంగా అధికార పార్టీకి చెందిన నేతలు, వారి అనుచరులు ఇళ్ల స్థలాల మెరక పేరిట కోట్లు విలువ చేసే ఎర్రకొండలను తవ్వి లారీల్లో తరలించేశారు. ఆలమూరు మండలం జొన్నాడ ఇసుక ర్యాంపులో నిబంధనలు పాటించకుండా ఇసుక తవ్వేశారు. గోదావరిలో గోతులు చెరువుల్లా మారడంతో యువత స్నానాలకు వెళ్లి మృత్యువాతపడ్డారు. ఆలమూరు జొన్నాడ వద్ద ఇసుక కొండలను జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు చూసి ఆశ్చర్యపోయారు. కొత్తపేట మండలం మందపల్లి(ఆలమూరు-2)గా ఉన్న ఇసుక రీచ్‌లో ఇసుక రవాణాకు హద్దులు..నిబంధనలను తుంగలోకి తొక్కి ఇసుక రవాణా చేశారు. పేరుకు ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో ఇసుక రవాణా చేస్తున్నామని చెప్తున్నా వైసీపీ నేతల ప్రైవేటు సైన్యంతోనే రవాణా సాగుతోంది.



బొండు ఇసుక మాయం : రావులపాలెం గోదావరిలో ఇలా

ఇసుక దోపిడీకి అడ్డేలేదు...



వైసీపీలో ఇసుక దోపిడీకి అడ్డేలేదు.. ప్రతిరోజూ లక్షలాది టన్నుల ఇసుకను తవ్వేసి అక్రమంగా ఎక్కడెక్కడికో తరలించేశారు. దీంతో గోదావరి చెంతనే ఉన్నా ఇసుక లభించడం గగనంగా మారింది.. భవన నిర్మాణ రంగ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది.
- వాదా ప్రసాదరావు, టీఎన్టీయూసీ అధికార ప్రతినిధి, మండపేట

దంపతులను మింగేశారు..



రౌతులపూడి, ఏప్రిల్ 24: వైసీపీ పాలనలో రౌతులపూడి మండలంలోని ఎస్.పైడిపాల, ఉప్పంపాలెం, మూలగపూడి, తిరుపతమ్మపేట, ఉప్పంపాలెం గ్రామాల్లో గల నల్లరాయి క్వారీలను కొల్లగొట్టేశారు. ఇష్టానుసారంగా తవ్వి పెద్దపెద్ద బండరాళ్లను విశాఖ, ఉప్పాడ, కొత్తపల్లి తదితర ప్రాంతాలకు తరలించారు. స్థానిక ఎమ్మెల్యేకు కప్పం కడితే చాలు రాయిని నచ్చినట్టు తవ్వుకొవచ్చు. వైసీపీ అక్రమ క్వారీ వ్యాపారానికి ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన దంపతులు పోలోజు వరహాలు (28), లక్ష్మీదుర్గాభవానీ మృతి చెందగా ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు.



ఎన్నికల పరిశీలకుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

ఎన్నికల పరిశీలకులను కలిసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ధవళేశ్వరం, ఏప్రిల్ 24 : జిల్లాకు వచ్చిన సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం, కమల్‌కాంత్ సరోచ్‌లను బుధవారం సాయంత్రం ధవళేశ్వరం ఇరిగేషన్ అతిథి గృహంలో కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజభరత్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.తమిళనాడుకు చెందిన కె.బాలసుబ్రహ్మణ్యం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, రాజానగరం, రాజమండ్రి అర్బన్, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన కమల్‌కాంత్ సరోచ్ కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గసాధారణ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. కలెక్టర్ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల పరిశీలన,ఈవీఎంల తరలింపు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ వంటి కార్యక్రమాలను వివరించారు.

పోలీస్ అబ్జర్వర్‌కి ఎస్పీ స్వాగతం



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనాకు ఎస్పీ జగదీశ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలోని పోలీసు విధుల పరిశీలనకు గుజరాత్‌కు చెందిన మీనా నియమితుల య్యారు.ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరం చేరుకున్నారు.

నేటితో నామినేషన్లు ముగింపు

- ఉమ్మడి జిల్లాల్లో ఆరో రోజు 145 నామినేషన్లు
- తూర్పుగోదావరి జిల్లాలో లోక్‌సభకు 11, అసెంబ్లీకి 40
- భారీగా క్యూకట్టిన స్వతంత్ర అభ్యర్థులు..

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో ఆరో రోజైన బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి (నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరులతో కలిపి) జిల్లాలో మొత్తం 145 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో లోక్‌సభకు 24, అసెంబ్లీకి 121 ఉన్నాయి.



టీడీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థిగా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నామినేషన్ పత్రం అందజేస్తున్న బాలయోగి తనయుడు గంటి హరీష్ మాధుర్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభకు 11, ఏడు అసెంబ్లీలకు 40 నామినేషన్లు దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానానికి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, స్వతంత్ర అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ తరపున సుంకవల్లి మురళీధరన్, వైసీపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు తరపున గూడూరి రాధిక, బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తరపున బొమ్ముల దత్తు, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ తరపున గిడుగు రుద్రరాజు, బీజేపీ అభ్యర్థి పురందేశ్వరి తరపున రేలంగి రాణిశ్రీదేవి, జైభా రత్ నేషనల్ పార్టీ తరఫున సింగులూరి మోహన్ రావు, స్వతంత్ర అభ్యర్థులుగా సాలోపంతుల రాఘవేంద్ర రావు, బొమ్మనబోయిన వెంకట శ్రీరామ మూర్తి నామినేషన్లు దాఖలు చేశారు. అనపర్తి అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, బీఎస్పీ తరపున కొల్లం శ్రీను, ఇండియన్ కాంగ్రెస్ తరపున ఎల్లా శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు. రాజానగరం అసెంబ్లీ నియోజక వర్గం నుంచి నవరంగ్ పార్టీ తరపున బత్తుల బలరామకృష్ణ (పల్నాడు జిల్లా), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థిగా కొత్తపల్లి భాస్కరరామం, జాతీయ జనపార్టీ తరపున బత్తుల బలరామకృష్ణ (కాకినాడ జిల్లా), స్వతంత్ర అభ్యర్థిగా బత్తుల వెంకటలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం సిటీ స్థానానికి జనవాహిని పార్టీ తరపున వేమన గణేష్, బీఎస్పీ అభ్యర్థిగా పరమట సురేఖ, లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థిగా వంగూరి విజయసత్య స్వతంత్ర అభ్యర్థిగా బేతాళ వేంకటేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. రాజమండ్రి రూరల్ అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, చెల్లుబోయిన నరేన్, పిరమిడ్ పార్టీ ఇండియా తరపున వాసంతి చంద్రరావు, జై భీమ్ రావు పార్టీ తరపున గునిపే కిరణ్‌కుమార్, భారత చైతన్య యువజన పార్టీ తరపున దుగ్గిరాల శ్రీదేవి, చల్లంగి నాగేశ్వరరావు నామినేషన్లు దాఖలుచేశారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండియన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరిగెల అరుణకుమారి తరపున గెడ్డం సాయిబాబు, లిబరేషన్ కాంగ్రెస్ తరపున బొంతా శ్యామ్‌రవిప్రకాష్, వైసీపీ తరపున తలారి వెంకట్రావు, టీడీపీ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున మద్దుల వీర వెంకట సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా తాతపూడి సుజయ్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్లు సమర్పించారు. నిడదవోలు అసెంబ్లీ నుంచి వైసీపీ తరపున జి.శ్రీనివాసనాయుడు, ఇండియన్ కాంగ్రెస్ తరపున పెద్దిరెడ్డి సుబ్బారావు, జైభారత్ నేషనల్ పార్టీ తరపున పులమాల వీరభద్రం, జనసేన తరపున కృష్ణతేజ, స్వతంత్ర అభ్యర్థులుగా అరిగెల సత్య వరప్రసాద్, కృష్ణతేజ నామినేషన్లు దాఖలు చేశారు. గోపాలపురం నుంచి వైసీపీ అభ్యర్థిగా తానేటి వనిత తరపున ఒక సెట్ నామినేషన్ వేశారు. జైభారత్ పార్టీ అభ్యర్థిగా ములగాల శ్రీనివాసరావు, జాతీయ జనసేన పార్టీ తరపున పెనుమాక వెంకటరత్నం, స్వతంత్ర అభ్యర్థులుగా రాపాక హరికృష్ణ, ముక్కువల్లి వెంకటరమణ, గెడ్డం ఆనందబాబు, దారాబత్తుల వీరేంద్ర విజయ్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. పలువురు అభ్యర్థులు ర్యాలీగా తరలివచ్చారు. కాగా గురువారంతో నామినేషన్ల ప్రక్రియ ముగియనున్నది.



పేపరుమిల్లు ఎదుట గుమిగూడిన కార్మికులు

ఏపీ పేపర్‌మిల్లు లాకౌట్

రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు యాజమాన్యం బుధవారం రాత్రి లాకౌట్ ప్రకటించింది. పేపరుమిల్లు కార్మికులు గత 20 రోజుల పైబడి న్యాయపరమైన డిమాండ్స్ సాధనకు సమ్మె చేస్తున్నారు.. డిమాండ్స్ ఒప్పుకునే వరకు సమ్మె విరమించబోమని జేఏసీ స్పష్టం చేసింది. ఈ మేరకు యాజమాన్యం బుధవారం రాత్రి లాకౌట్ నోటీస్‌ను మిల్లు నోటీసు బోర్డులో పెట్టింది. - వివరాలు 7లో

మేం వస్తే.. పెన్షన్ రూ.4 వేలు





ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది.. ఎండను సైతం లెక్కచేయక అభ్యర్థులు ఓటర్లతో మమేకమవుతున్నారు.. సమస్యలు వింటూ.. మీకు మేమున్నామంటూ ముందుకు సాగుతున్నారు.. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్.. రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి వృద్ధులకు మేమున్నాం.. మీ పింఛన్ రూ.4 వేలకు పెంచుతాం అంటూ బుధవారం ఇలా భరోసా ఇచ్చారు.



సైకిళ్ల గజమాల

కొత్తపేట, ఏప్రిల్ 24: కొత్తపేట టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు నామినేషన్ సందరంగా 13 చిన్నసైకిళ్లతో పాటు టీడీపీ, జనసేన జెండాలతో కూడిన భారీ గజమాలను బండారు అభిమానులు తయారు చేశారు. కొత్తపేటలో బండారుకు భారీ క్రేన్ సహాయంతో సైకిళ్ల గజమాలను వేసి స్వాగతం పలికారు.



ఆయన పేరు సీఎం

జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ అనే వ్యక్తిని సీఎం అని పిలుస్తుంటారు నియోజకవర్గ నేతలు. ఎందుకంటే ఆయన టీడీపీ ఆవిర్భావం నుంచి అదే పార్టీలో కొనసాగుతున్నారు. గతంలో దివంగత నేత ఎన్టీఆర్ కార్యక్రమాలో పాల్గొనేవారు. ఇప్పుడు చంద్రబాబు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. చంద్రబాబు వస్తే ఈయన ఉండాల్సిందేనని టీడీపీ నేతలు మాట్లాడుకోవడం విశేషం. జగ్గంపేట నియోజకవర్గంలో నెహ్రూరా వెన్నంటే ఉంటూ అన్న క్యాంటీన్‌ను దగ్గరుండి చూసుకోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

● జగ్గంపేట



గబ్బర్‌సింగ్ టీమ్ ప్రచారం



ఇసుకపల్లి (కొత్తపల్లి), ఏప్రిల్ 24: పాత ఇసుకపల్లిలో పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా బుధవారం సాయంత్రం గబ్బర్‌సింగ్ సినిమాలో నటించిన కొందరు నటులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్నారని, ఆయన ఎన్నికల గుర్తు గాజు గ్లాసు అని అవగాహన కల్పిస్తున్నారు. మధ్యమధ్యలో గబ్బర్‌సింగ్ సినిమాలో డైలాగులతో ఆకర్షిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. మేనెల జనసేన నాయకులు మురాలశెట్టి సునీల్‌కుమార్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, మత్సా అప్పాజీ, పలువురు బుల్లితెర ఆర్టిస్టులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

చంద్రబాబుతో వంతల, శిరీషా భేటీ



రంపచోడవరం, ఏప్రిల్ 24: రంపచోడవరం తెలుగుదేశం పార్టీలో చోటు చేసుకున్న టికెట్ వివాదానికి బుధవారం శ్రీకాకుళం జిల్లాలో పార్టీ అధినేత చంద్రబాబు జోక్యంతో పూర్తి స్థాయిలో తెరపడింది. గత నెల రోజులకు పైగా రెండు వ్యతిరేక వర్గాలుగా సాగిన ఇక్కడి దేశం వివాద వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న చంద్రబాబు తెలుగుదేశం అభ్యర్థి మిరియాల శిరీషాదేవి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరిను శ్రీకాకుళం పిలిపించుకుని మాట్లాడారు. రాజేశ్వరికి తగిన ప్రాధాన్యం ఇటు పార్టీలోనూ, రాబోయే ప్రభుత్వంలోనూ కచ్చితంగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. శిరీషాదేవిని ముందుండి నడిపించి రంపచోడవరం సీటును తిరిగి తెలుగుదేశానికి తెచ్చి ఇవ్వాలని వంతల రాజేశ్వరికి, ప్రతి కార్యక్రమంలోనూ రాజేశ్వరిని కలుపుకుని వెళ్లాలని శిరీషకు సూచించారు. అంతే కాకుండా తక్కిన మాజీ ఎమ్మెల్యేలను, ముఖ్యనాయకులను, సమన్వయం చేసుకుని రంపచోడవరంలో తెలుగుదేశం జండాను రెపరెపలాడించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, టీడీపీ సీనియర్ నాయకుడు డి.శివరామ చంద్రరాజు(శివాజీ) తదితరులు ఉన్నారు.



పొలిటికల్ సెంటిమెంట్

ఎన్నికల వేళ తప్పక ఫాలో అవుతున్న నాయకులు



శివాలయం

ఆ ఊరు ఓ సెంటిమెంట్

రాజానగరం/దివాన్‌చెరువు, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులకు రాజానగరం మండలంలోని తూర్పుగోనగూడెం గ్రామం సెంటిమెంట్ గ్రామంగా పేరుగాంచింది. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో సైతం విజయం వరించిన వారు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా పదవులు లభించిన వారు తమ సెంట్‌మెంట్‌ను కొనసాగిస్తూ వచ్చారు. జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గమైన కడియం శాసనసభ నియోజకవర్గానికి 1972 నుంచి 2004 వరకు ఎనిమిది పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఆ నియోజకవర్గం పరిధిలోనే రాజానగరం మండలం చేరి ఉండటంతో ఇక్కడ నుంచి పోటీ చేసే అభ్యర్థులు తూర్పుగోనగూడెం గ్రామాన్ని సెంట్‌మెంట్‌గా భావించేవారు. నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉండటంతో అభ్యర్థులు తొలుత తూర్పుగోనగూడెంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శివాలయంలో పూజలు చేసిన అనంతరం ఇక్కడ నుంచే ప్రచారం ప్రారంభించేవారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జక్కంపూడి రామ్మోహనరావు ఎన్నికల బరిలో నిలిచిన ప్రతిసారి ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ వచ్చారు. ఆయన శాసన సభ్యునిగా విజయం సాధించడంతో పాటు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కడంతో అభ్యర్థులకు ఈ నమ్మకం మరింత బలపడింది. అలాగే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన ఉండవల్లి అరుణకుమార్, కందుల దుర్గేష్ గ్రామ శివాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజానగరం నియోజకవర్గం ఆవిర్భవించిన అనంతరం తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పెందుర్తి వెంకటేష్ కూడా ఇదే సెంటిమెంట్ పాటించి ఎన్నికల్లో విజయం సాధించారు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి ముంద్రు వెంకట శ్రీనివాస్ తొలుత తూర్పుగోనగూడెం వచ్చి శివాలయంలో పూజలు చేసి తర్వాత ఈ గ్రామం నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అలాగే మంత్రిగా జక్కంపూడి రామ్మోహనరావు పలు ప్రభుత్వ కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు కూడా తూర్పుగోనగూడెం గ్రామం నుంచి శ్రీకారం చేశారు.



● జగ్గంపేట రావులమ్మతల్లి దయ ఉండాల్సిందే..

జగ్గంపేట నియోజకవర్గంలో ఏ రాజకీయ నాయకుడైనా జగ్గంపేట గ్రామ దేవత రావులమ్మతల్లిని దర్శించుకుని ఎన్నికల బరిలో దిగుతారు. ఎన్నికలే కాదు రాజకీయ నాయకులు ఏ నిర్ణయాలు తీసుకోవాలన్నా అమ్మవారిని దర్శించుకుని ఆ తర్వాతనే తీసుకుంటారు. రాజకీయ నాయకులందరికీ జగ్గంపేట రావులమ్మతల్లి అమ్మవారి ఆలయం ఓ సెంటిమెంట్. అమ్మవారిని దర్శించుకుని తమతమ పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. ప్రచారాలు మొదలు నామినేషన్లు, ఓటు వేసే ముందు, గెలిచిన తర్వాత, ప్రమాణస్వీకారం చేశాక ఇలా నేతలంతా రావులమ్మను దర్శించుకోవాల్సిందే..

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు

ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను మూడు రకాలుగా విభజించారు. మొదటిది సాధారణ పోలింగ్ కేంద్రం, రెండోది సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రం, మూడో రకం అతిసున్నితమైన పోలింగ్ కేంద్రం. రాజకీయ పార్టీలు, తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు ఇతరేతర సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ విధమైన విభజన జరిగింది. సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించి జియోట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసి ఉంటారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు కేంద్రాలను పర్యవేక్షిస్తుంటారు. ● పెద్దాపురం



మరో రెండు వాహనాలకు మాత్రమే అనుమతి

పెద్దాపురం, ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థితో పాటు మరో రెండు వాహనాలకు మాత్రమే ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. అనుమతి లేకుండా వాహనాలను తిప్పితే సీజ్ చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. అభ్యర్థుల ప్రచారంపై నిఘా ఉంది. రెవెన్యూ, పోలీస్ తదితర అధికారులు పార్టీ నాయకుల కదలికలను గమనిస్తున్నారు. వాహనాలు, ప్రచారానికి పెడుతున్న ఖర్చులను లెక్కిస్తున్నారు. అభ్యర్థులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఇప్పటికి 15 సార్లు ఎన్నికలు



పెద్దాపురం, ఏప్రిల్ 24: ఇప్పటివరకూ 15 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1952 నుంచి 2014 వరకూ 14 సార్లు ఎన్నికలు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి తరువాత 1952లో తొలిసారి రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1957 ఫిబ్రవరి 25, 1962 ఫిబ్రవరి 19, 1967 ఫిబ్రవరి 8, 1972 మార్చి 15, 1978 ఫిబ్రవరి 25, 1983 మే 1, 1985 మే 3, 1989 నవంబరు 22, 1994 డిసెంబరు 1, 1999 సెప్టెంబరు 18, 2004 ఏప్రిల్ 20, 2009 ఏప్రిల్ 16, 2014 ఏప్రిల్ 30, 2019 ఏప్రిల్ 11 ఎన్నికలు జరిగాయి.

కాకినాడ రూరల్ నియోజకవర్గం





పిల్లి అనంతలక్ష్మి



కురసాల కన్నబాబు



అనిశెట్టి

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009 సంవత్సరంలో కాకినాడ రూరల్ నియోజవర్గం ఏర్పాటు అయింది. అంతకు ముందు 1967 సంవత్సరం నుంచి 2009 వరకు సంపర నియోజకవర్గంగా ఉండేది. ఇందులో కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, పెదపూడి మండలాలతో పాటు సామర్లకోట మండలంలోని 9 గ్రామాలు, కరప మండలంలోని ఒక గ్రామం ఉండేవి. సంపర నియోజకవర్గంగా 9 పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నికలు జరగ్గా, టీడీపీ, కాంగ్రెస్ నాలుగేసి సార్లు గెలుపొందాయి. టీడీపీ ఆవిర్భావం నుంచి సంపర టీడీపీకి కంచుకోటగా మారింది. పునర్విభజన తర్వాత కాకినాడ రూరల్ నుంచి ప్రజారాజ్యం, టీడీపీ, వైసీపీ నుంచి వరుసగా గెలుపొందారు.



పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా..

కాకినాడ రూరల్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. కాకినాడ సిటీకి నాలుగు దిక్కులా ఈ మండలం వ్యాపించి ఉంది. ఈశాన్య దిక్కున నేమాంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, పడమర దిక్కు సర్పవరంలో అతి పురాతనమైన శ్రీరాజ్యలక్ష్మి సమేత భావన్నారాయణ స్వామి ఆలయం ఉంది. ఉత్తరాన తూరంగిలో తూరంగేశ్వరస్వామి ఆలయం, రేపూరులో స్వయంభు ఆలయాలు ఉన్నాయి. ప్రముఖ పర్యాటక కేంద్రంగా సూర్యారావుపేట బీచ్‌ను ప్రభుత్వం రూ.45 కోట్ల స్వదేశీ దర్శన్ నిధులతో అభివృద్ధి చేసింది. బీచ్ ఫ్రంట్‌లో భాగంగా వాటర్ ఫౌండేయన్, గ్లాస్ బ్రిడ్జి, పలు రెస్టారెంట్లు నిర్మించారు. పర్యాటకులు,విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు యుద్ధ విమాన మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. దేశానికి సేవలు అందించిన టీయూ-142 ఎం యుద్ధ విమాన మ్యూజియం గుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బీచ్ ఫ్రంట్, మ్యూజియం నిర్వహణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక ప్రారంభ శూరత్వంగా మిగిలాయి. సముద్రం మార్గంగుండా ఇతర దేశాల నుంచి కాకినాడకు వచ్చే ఓడలు (మాస్టర్ వెస్సల్స్) లేండ్ గుర్తింపు కోసం బ్రిటిష్ ప్రభుత్వం వాకలపూడిలో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో 1878లో 110 అడుగుల ఎత్తులో 110 మెట్లతో లైట్‌హౌస్ నిర్మించింది. దీనికి ప్రత్యామ్నాయంగా 2004లో రూ 1.30 కోట్లతో 47.88 మీటర్ల ఎత్తులో నూతన లైట్‌హౌస్ నిర్మించారు.

పచ్చళ్లకు, తాండ్రకు ప్రసిద్ధి



సర్పవరం, పండూరు, తమ్మవరం తదితర గ్రామాల్లో పచ్చళ్ల తయారీ, మామిడి తాండ్రల తయారీ ఎక్కువ. పచ్చళ్ల పరిశ్రమ కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతోంది. సర్పవరంలో పువ్వుల తోటలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ అధికంగా మల్లెపువ్వులు ఉత్పత్తి చేస్తున్నారు. మామిడి తాండ్ర తయారీ పరిశ్రమలపై వేలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు.

ఆధ్యాత్మికతకు పరిశ్రమలకు కొలువు నెలవు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం ఉంది. విశాల సముద్రతీరం, దీనికి ఆనుకుని పలు ఆయిల్ రిఫైనరీలు, పరిశ్రమలు, పోర్టు కార్యకలాపాలు, కోరమండల్, జీఎఫ్‌సీఎల్ ఎరువుల కర్మాగారాల పరిశ్రమలకు నెలవుగా నియోజకవర్గం రూపాంతరం చెందింది. సిటీకి నాలుగు దిక్కులా విస్తరించి ఉండటం, వేలాది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తూ, ఏటేటా నగరానికి సమాంతరంగా అభివృద్ధి చెందుతోంది.



● (సర్పవరం జంక్షన్)

కాకినాడ రూరల్ నియోజకవర్గం

సంవత్సరం	విజేత	పార్టీ
2009	కురసాల కన్నబాబు	ప్రజారాజ్యం
2014	పిల్లి అనంతలక్ష్మి	టీడీపీ
2019	కురసాల కన్నబాబు	వైసీపీ

సంపర నియోజకవర్గం

సంవత్సరం	విజేత	పార్టీ
1962	చెరుకువాడ వెంకటరత్నం	కాంగ్రెస్
1972	చెరుకువాడ వెంకటరత్నం	కాంగ్రెస్
1978	మట్టా వెంకటరమణ	కాంగ్రెస్
1983	సత్యలింగనాయకర్	టీడీపీ
1985	సత్యలింగనాయకర్	టీడీపీ
1989	అనిశెట్టిబుల్లి అబ్బాయిరెడ్డి	కాంగ్రెస్
1994	సత్యలింగ నాయకర్	టీడీపీ
1999	పిల్లి అనంతలక్ష్మి	టీడీపీ
2004	అనిశెట్టిబుల్లిఅబ్బాయిరెడ్డి	కాంగ్రెస్

స్వరూపం ఇది..

కాకినాడ సిటీకి నాలుగు దిక్కులా ఈ నియోజకవర్గం భౌగోళికంగా, విస్తీర్ణ పరంగా వ్యాపించి ఉంది. నియోజకగర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో కాకినాడ రూరల్ నియోజకవర్గం ఏర్పాటు చేశారు. తాళ్లరేవు నియోజకవర్గం రద్దు కావడంతో ఇందులో ఉన్న కరప మండలం, సంపర నియోజకవర్గంలో గల కాకినాడ రూరల్ మండలాలతో పాటు అర్బన్ పరిధిలో గల 6 డివిజన్లతో కాకినాడ రూరల్ నియోజకవర్గం ఏర్పడింది. కాకినాడ రూరల్‌లో 20 గ్రామ పంచాయతీలు, కరప మండలంలో 23 పంచాయతీలతో పాటు కార్పొరేషన్‌లో 1,2,3,48,49,50 డివిజన్లు ఉన్నాయి. తర్వాత 42వ డివిజన్ కలిపారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో మొత్తం 2,69,222 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,33,427 కాగా, మహిళా ఓటర్లు 1,35,788 ఉన్నారు. కాకినాడ రూరల్ మండలంలో 1,51,762 మంది ఓటర్లు, కరప మండలంలో 64,457 మంది ఓటర్లు, అర్బన్ పరిధిలోని 7 డివిజన్లలలో 53,003 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ కాపు, ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన ఓట్లు అధికంగా ఉన్నాయి. దీనికి సమానంగా బీసీ శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లతో పాటు ఇతర బీసీ కులాల ఓటర్లు ఉన్నారు. కాపు,శెట్టిబలిజ సామాజికవర్గం ఓటర్లు ఏ పార్టీకి ఓట్లు వేస్తారో వారి విజయం సులువు అవుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక్కడ ఓటర్లు మాత్రం కులాలు, అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వకుండా రాజకీయపరంగా వీచే గాలిని బట్టే అభ్యర్థుల విజయావకాశాలు ఉండటం విశేషం. వ్యక్తిగత చరిష్మాతో ఏ ఒక్క అభ్యర్థి ఎమ్మెల్యే కాకపోవడం గమనార్హం.

నియోజకవర్గాన్ని వేధిస్తున్న సమస్యలు ఇవే..

పండూరు తాగునీటి పథకం విస్తరణ కోసం ఇప్పటి వరకు సుమారు రూ.40 కోట్లు వరకు వెచ్చించినా కాకినాడ రూరల్ మండల ప్రజానీకానికి పూర్తిస్థాయిలో తాగునీరందని పరిస్థితులు నెలకొన్నాయి. పూర్వం నాటి పైపులైన్లు ఉండటం, జలజీవన్ పథకంలో ఇంటింటికీ కొళాయిలు వేసినా, తగినన్ని ఓవర్ హెడ్‌ట్యాంకులు లేవు. అందుబాటులో ఉన్న ఓహెచ్‌ఆర్‌లు శిథిలావస్థకు చేరడం, ఉన్న ట్యాంకులకు పూర్తి సామర్థ్యంలో నీరు లోడింగ్ లిఫ్టింగ్ చేయకపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వాకలపూడి, వలసపాకల తదితర గ్రామాల్లో కోరమండల్ ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 170 కిలోమీటర్ల మేర సిమ్మెంట్ రోడ్లు నిర్మించినా, వీటికి సమాంతరంగా డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామాల్లో మురుగునీరు ముందుకెళ్లే వీలులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్వం నిర్మించిన డ్రైనేజీలు శిథిలావస్థకు చేరడంతో ఇళ్లలోని వాడకం, మురుగు నీరు రోడ్లు, ఖాళీస్థలాల్లోకి చేరుతుంది. దోమలతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మత్స్యకార గ్రామాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. గ్రామాల్లో సేకరించిన చెత్త,వ్యర్థాలను డంపింగ్ చేసేందుకు డంపింగ్ యార్డులు లేక, రోడ్ల పక్కనే చెత్త వేయడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

'గాలి'ని బట్టి అభ్యర్థి గెలుపు

సంపర నియోజకవర్గం ఆవిర్భవించిన నాటి నుంచి, పునర్విభజనలో ఏర్పాటైన రూరల్ నియోజకవర్గం ఎన్నికల వరకు గెలుపొందిన అభ్యర్థుల నేపథ్యాన్ని పరిశీలిస్తే ఇక్కడ పోటీ చేసే అభ్యర్థుల గెలుపోటముల్లో ఆయా రాజకీయ పార్టీల ఘనత, గాలి ప్రభావమే కీలకపాత్ర వహిస్తోంది. ఇక్కడ పోటీ చేసే అభ్యర్థుల వ్యక్తిగత, సామాజిక వర్గాల ప్రమేయం లేకుండా ఓటర్లు విలక్షణ తీర్పునివ్వడం విశేషం. రాజకీయ పార్టీలకు వీచే గాలిని బట్టే ఎమ్మెల్యేలుగా అభ్యర్థులు విజయం సాధిస్తున్నారు. వరుసగా రెండు సార్లు నెగ్గిన ఎమ్మెల్యేలెవరూ పూర్వం నుంచి ఇక్కడ లేకపోవడం విశేషం. ఒక్క 1983, 1985 సంవత్సరాల్లో వరుసగా రెండు పర్యాయాలు టీడీపీకి చెందిన మత్స్యకార సామాజిక వర్గం ఎమ్మెల్యే తిరుమాని సత్యలింగనాయకర్ ఒక్కరే విజయం సాధించారు.

జన కేతనం

ఆంధ్రజ్యోతి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

గురువారం 25 ఏప్రిల్ 2024 7

వైసీపీ వలకు చిక్కలేదు.. నాయకుల ప్రలోభాలకు లొంగలేదు.. అధిష్ఠానం ఆదేశాలు పట్టించుకోలేదు.. మరో రెండు రెట్లు జీతం పెంచి ఇస్తామన్నా వద్దు పొమ్మంటున్నారు.. తెలిసి తెలిసి ఎవరైనా పాము పుట్టలో వేలు పెడతారా.. ప్రస్తుతం వలంటీర్లు అదే చేస్తున్నారు.. మీ గాలి మాకొద్దు.. మా జోలికి రావొద్దంటూ దూరంగా పోతున్నారు. దీంతో జగన్ ఒకటి తలిస్తే వలంటీర్లు మరొకటి తలచారంటూ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఉద్యోగాలు లేక ఉపాధి కోసం వలంటీర్లుగా సేవ చేయడానికి ముందుకు వచ్చిన యువతీ యువకులను వైసీపీ అడ్డగోలు పనులకు ఉపయోగించుకోవాలని ప్రయత్నించిన సంగతి తెలిసిందే. చివరకు ఎన్నికల్లో కూడా వారి సేవలను దుర్వినియోగం చేసే ప్రయత్నం చేయడం గమనించి ఎన్నికల కమిషన్ వారిని ఎన్నికల విధులకు, సంక్షేమ పథకాల పంపిణీలకు దూరంగా ఉంచింది. ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లో లబ్ధిదారులకు ఇబ్బందిలేకుండా చూడాలని ఆదేశించింది.



వలలో పడలేదు!

- వలంటీర్లపై పడని ఫ్యాన్ గాలి
- వైసీపీ ఒత్తిళ్లకు లొంగని వైనం
- 29.4 శాతమే రాజీనామా
- 70.6శాతం నిలబడే ఉన్నారు
- ఫలించిన చంద్రబాబు వ్యూహం
- వలంటీర్లకు నెలకు రూ.10వేలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఈనెల ఒకటో తేదీన పింఛన్లు పంపిణీకి అడ్డంకులు సృష్టించి ఆ నెపాన్ని ప్రతిపక్షాల మీద వేయాలని వైసీపీ విఫలయత్నం చేసింది. తర్వాత వలంటీర్ల చేత బలవంతంగా రాజీనామాలు చేయించి, వారికి పార్టీ కండువాలు కప్పి ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని ప్రయత్నించింది. కొందరు వలంటీర్లకు ఈ ఎన్నికల నెలలో రూ.15 వేల నుంచి రూ25 వేల వరకూ జీతం ఇస్తామని ప్రలోభపెట్టి రాజీనామా చేయించింది. కానీ అంతకు ముందు జీతాలు పెంచమని కోరినందుకు అనేకమందిని వైసీపీ నేతల ఒత్తిడితో అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో వైసీపీ మాటలను ఎక్కువమంది వలంటీర్లు నమ్మడం లేదు. వైసీపీ నాయకుల తాటాకు చప్పుళ్లకు వలంటీర్లు లొంగడం లేదు. ఇంతలో టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి తరపున టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, పైగా నెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని, అంతేకాక తాము అధికారంలోకి రాగానే వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి పోత్సహిస్తామని సూచించారు. కానీ వైసీపీ తప్పుడు మాటలకు, ప్రలోభాలకు లొంగి తప్పుడు పనులు చేయవద్దని పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. చంద్రబాబు చెప్పిన ఈ మాటలు ఎక్కువమంది వలంటీర్లకు నచ్చాయి. దీంతో వైసీపీ నేతలు ఎంత ఒత్తిడి తెచ్చినా ఎక్కువ మంది ఏదో కారణంచెప్పి తప్పించుకుంటున్నారు. రాజీనామాలు చేయడం లేదు. కొందరైతే తిరగబడుతున్నారు. తూర్పుగోదా వరి జిల్లాలో మొత్తం 9099 మంది వలంటీర్లు ఉండగా ఇప్పటివరకూ కేవలం 2,675 మంది రాజీనామా చేశారు. ఇది కేవలం 29.4 శాతమే. కొన్ని తప్పులు చేయడంవల్ల 30 మందిని అధికారులు తొలగించారు. ఇంకా 6394 మంది వలంటీర్లుగానే ఉన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటిస్తూ, ఆయా డ్యూటీలకు దూరంగా ఉన్నారు. కొవ్వూరు అర్బన్‌లో ఒక్కరు కూడా రాజీనామా చేయకపోవడం గమనార్హం. దేవరపల్లిలో ఒకరిని, గోపాలపురంలో ఇద్దరిని, నల్లజర్లలో ఒకరిని, రాజమహేంద్రవరం అర్బన్‌లో 24మందిని, సీతానగరంలో ఇద్దరిని అధికా రులు వివిధ కారణాలవల్ల తొలగించారు. రాజమహేంద్రవరంలో కేవలం 17 మంది రాజీనామా చేయగా 1526 మంది రాజీనామా చేయ కుండా నిలబడ్డారు. నిడదవోలు రూరల్‌లో 310 ఉండగా అక్కడ నేతలు 307 మంది చేత రాజీనామా చేయించారు. కానీ ముగ్గురు లొంగలేదు. నిడదవోలు నియోజకవర్గంలో అత్యధికంగా 1033 మందితో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించారు. గోపాలపురం నియోజకవర్గంలో మంత్రి తానేటి వనిత పరిధిలో 392 మంది, రాజానగరంలో 391 మంది, రూరల్ నియోజకవర్గంలో 343 మందితో రాజీనామా చేయించారు. ప్రస్తుతం అన్ని సర్వేలు టీడీపీ-జనసేన- బీజేపీ కూటమే అధికారంలోకి వస్తున్నట్టు తేల్చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రాజీనామాలు చేసిన వలంటీర్లకు పాపం ఇబ్బందే. మిగతా వలంటీర్లంతా ఆనందంగా ఉన్నారు. జీతాలు పెంచాలని కోరినప్పుడు సస్పెన్షన్‌కు గురైన వారు కూడా టీడీపీ నేతలతో మంతనాలు చేస్తున్నట్టు సమాచారం.

సామాన్యుల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్

- రాజమహేంద్రవరం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



ఆంధ్రా పేపర్ మిల్లు వద్ద కార్మికులతో మాట్లాడుతున్న రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24: సామాన్య ప్రజల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని రాజమహేంద్రవరం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో పర్యటించారు. సిటీ అభ్యర్థి బోడా వెంకట్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్మికులు, కర్షకులు, కూలీలు, చిరువ్యాపారులు, మహిళను కలిసి 9 గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడారు. ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వాలు ప్రజలను నమ్మించి మోసం చేశాయన్నారు. నిరుద్యోగ సమస్య తాండివిస్తోందన్నారు. రాష్ట్రం పూర్తిగా వెనకబడిపోయిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప మరేమి జరగలేదన్నారు. దేశంలో సుస్థిరమైన పాలన, రాష్ట్రంలో అభివృద్ధి, విభజన హామీలు అమలు చేసేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు.

● పేపరుమిల్లు కార్మికులకు మద్దతు

రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపరుమిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించిన విషయం తెలుసుకున్న ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్ పేపరుమిల్లు వద్దకు చేరుకుని కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికులు చేసే పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుదన్నారు. కార్మికుల కోసం దేనికైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. మిల్లు యాజమాన్య తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఎన్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని కార్మికులకు మద్దతు ప్రకటించారు.

సత్యదేవానర్సరీని సందర్శించిన తెలంగాణా అటవీ అకాడమీ



సత్యదేవానర్సరీని సందర్శించిన అటవీశాఖ బృందం

కడియం, ఏప్రిల్ 24: విజ్ఞాన పర్యటనలో భాగంగా తెలంగాణా రాష్ట్ర అటవీ అకాడమీ బుధవారం కడియపులంక పుల్లా చంటియ్య -సత్యదేవానర్సరీని సందర్శించారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాగిని భాను, బృందం 16మంది, 22వ బ్యాచ్ ఫారెస్టు సెషన్ ఆఫీసర్లు నర్సరీని సందర్శించారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాగిని భాను మాట్లాడుతూ దేశవిదేశీ ఉద్యాన సంపద ఒకేచోట నిక్షిప్తమైన ఏకైక ప్రాంతం కడియం అన్నారు. ఇక్కడ ఉన్న వేలరకాల మొక్క జాతులు, వాటి శాస్త్రీయ నామాలు గురించి తెలుసుకోవచ్చన్నారు. ఉద్యానవన శిక్షకులకు తెలంగాణా అటవీ శాఖ ఆరాష్ట్రంలోని అడవులను, అభివృద్ధిచేయడం కోసం ఈ ప్రాంతాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ నర్సరీలో మొక్క ఉత్పత్తులు గురించి నర్సరీ అధినేత డా పుల్లా చంటి, ఎండీ పుల్లా పెదసత్యనారాయణలను అడిగి తెలుసుకున్నారు. డా. పుల్లా రామకృష్ణ, మెర్ల కృష్ణ తదితరులుఉన్నారు.

ఘనంగా శ్రీపుష్పోత్సవం

ఆత్రేయపురం, ఏప్రిల్ 24: వాడపల్లి శ్రీదేవి, భూదేవి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం ముగిశాయి. వేకువజామున స్వామివారికి మేలుకొలుపు, పుణ్యాహవాచనం, ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాలభోగం నిర్వహించారు. వైఖనస ఆగమశాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు స్వామివారికి ద్వాదశ ప్రదక్షిణలు, అర్చన, నివేదన, మహదాశీర్వచనం, పండిత సత్కారాలను శాస్త్రోక్తంగా జరిపారు. మేళతాళ, మంగళవాయిద్యాలతో స్వామివారి ప్రదక్షిణ గావించారు. 11 రకాల పిండి వంటలు, వివిధ రకాల ఫలాలతో మహా నివేదన సమర్పించారు. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన అద్దాల మండపంలో స్వామివారి శ్రీపుష్పోత్సవం, పవళింపు సేవ కనుల పండువగా జరిగాయి. దంపతులకు తాంబూలాలు అందజేశారు. ఈవో భూపతి రాజు కిషోర్‌కుమార్- ఉ మా సుందరి దంపతులుపాల్గొన్నారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

శాస్త్రోక్తంగా కళావాహన

- ● బాణలింగం ప్రతిష్ఠ... అభిషేకం, పూజలు
- ● భీమేశ్వరాలయం గర్భాలయాలు మూసివేత



నందిమండపంలో ప్రతిష్ఠించిన బాణలింగం, శ్రీచక్రం

ద్రాక్షారామ, ఏప్రిల్ 24: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మంగళవారం ఉదయం కళావాహన వేదపండిత బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భీమేశ్వరాలయంలో మూలవిరాట్‌కు రక్షణచర్యలు చేపట్టనుండటంతో గర్భాలయాలు మూసివేత నేపథ్యంలో నంది మండపంలో దేవులపల్లి ఫణిరామకృష్ణ, వైదిక బృందం ఆధ్వర్యంలో కళావాహన పూజాధికాలు జరిపారు. 7.30గంటలకు సంకల్పం, గణపతిపూజ కలశస్థాపన జరిపారు. 10.39గంటలకు కళావాహన కార్యక్రమం జరిపారు. నంది మండపంలో శృంగేరి పీఠాధిపతులు సమర్పించిన బాణలింగం ప్రతిష్ఠ జరిపారు. ఉత్సవమూర్తులకు పూజలు చేశారు.

గర్భాలయంలో ప్రాతఃకాల పూజలు

ఉదయం భీమేశ్వరాలయం మూలవిరాట్‌కు ప్రాతఃకాలార్చన జరిపారు. మేలుకొలుపు, సుప్రభాతం ప్రథమాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. నివేదన అనంతరం కళావాహన కార్యక్రమం నిర్వహించారు. దేవదాయశాఖ సహాయకమీషనరు డి.నాగమల్లేశ్వరరావు, ఈవో పి.టి.వి.సత్యనారాయణ, ఆలయ అర్చకులు, వేదపండిత బృందం పాల్గొన్నారు.

గర్భాలయాలు మూసివేత



భీమేశ్వరాలయంలో మూలవిరాట్‌కు రసాయన రక్షణ చర్యలు, అమ్మవారి గర్భాలయంలో అభివృద్ధి పనులు కేంద్రపురావస్తుశాఖ చేపట్టనుండటంతో గర్భాలయాలు మూసివేశారు. దక్షిణద్వారం తలుపులు మూసివేశారు. పురావస్తు శాఖాధికారులకు అప్పగించారు.

లాకౌట్ ప్రకటించిన ఏపీ పేపరు మిల్లు



పేపరుమిల్లు వద్ద గుమికూడిన పేపరుమిల్లు కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24: రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు యాజమాన్యం బుధవారం రాత్రి లాకౌట్ ప్రకటించింది. పేపరు మిల్లు కార్మికులు గత 20 రోజుల పైబడి తమ న్యాయపరమైన డిమాండ్స్ సాధన కోసం సమ్మె చేస్తోంది. ఈ క్రమంలో గతంలోనే యాజమాన్య ప్రతినిధులకు, కార్మిక సంఘాలకు మధ్య జాయింట్ లేబర్ కమిషనర్ సమక్షంలో సమావేశాలు జరిగాయి. యూనియన్ల గుర్తింపులను రద్దు చేయి ంచే ప్రయత్నంలో భాగంగా యాజమాన్యం కోర్టుకు వెళ్లడం, అగ్రిమెంట్ విషయంలో కార్మికుల వాదనను యాజమాన్యం పట్టించుకోలేదు. దీంతో 11 కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి సమ్మెలోకి వెళ్లారు. అయినా యాజమాన్యం పట్టించుకోలేదు. రెండు మూడు పర్యాయాలు కార్మికులను విధులకు హాజరుకావాలని యాజమన్యం కోరింది. న్యాయపరమైన డిమాండ్స్ ఒప్పుకునేవరకు సమ్మెవిరమించమని జేఏసీ స్పష్టం చేసింది. యాజన్యం బుధవారం రాత్రి లాకౌట్ నోటీస్‌ను మిల్లు నోటీసు బోర్డులో పెట్టింది. దీంతో కార్మికులు యాజమాన్యం, హెచ్ఆర్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. న్యాయం జరిగేవరకు పోరా టం ఆగదని కార్మిక జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

ఖేలో ఇండియాలో నాణ్యమైన నిర్మాణాలు: నన్నయ వీసీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 24: ఖేలో ఇండియాలో మంజూరైన నిధులను విడుదలచేసి నాణ్యమైన నిర్మాణాలను అందజేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు కోరారు. నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా పనులను పరిశీలించేందుకు బుధవారం వచ్చిన ఖేలో ఇండియాప్రాజెక్టు మానిటరింగ్ కమిటీ బృందం వీసీతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వీసీ వినతిపై సానుకూలంగా స్పందించిన బృందం ప్రస్తుతం పరిశీలించిన నిర్మాణపనులపై నివేదిక సమర్పించి మంజూరైన నిధులు విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఖేలోఇండియా నిధులు రూ8.30 కోట్లతో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ పనులను ఖేలో ఇండియా ప్రాజెక్టు మానిటరింగ్ కమిటీ ఛైర్మన్ పి.రామకృష్ణ. శాప్ సభ్యులు రజత్‌చౌహాన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి పి.సతీష్‌కుమార్, శాప్ అధికారి ఎస్.వి.రమణ, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇంజనీర్ కె.నూకరత్నంలతో కలసి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న స్టేడియం. స్విమ్మింగ్‌పూల్ నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయని వీసీ అన్నారు. గోదావరి జిల్లాల్లోని క్రీడా పోటీలకు జాతీయస్థాయి వేదికలుగా నిలుస్తాయన్నారు.జిల్లా డీఎస్‌డీవో, డీఎంఎం శేషగిరి, విశ్వవిద్యాలయం క్రీడాబోర్డు అధ్యాపకులు పాల్గొన్నారు.



ఖేలో ఇండియా పనులు పరిశీలిస్తున్న మానిటరింగ్ కమిటీ బృందం

వీల్‌చైర్‌ల కొనుగోలులో గోల్‌మాల్

- ● డీపీవోపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- ● కలెక్టర్‌కు సర్పంచ్‌లు ఫిర్యాదు

కడియం, ఏప్రిల్ 24: పంచాయతీలకు నిధులు లేక ఇబ్బందులు పడుతుంటే సొమ్ములు కోసం జిల్లా పంచాయతీ అధికారి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని జేగురుపాడు సర్పంచ్, న్యాయవాది యాదల స్టాలిన్ ఆరోపించారు. బాపట్ల జిల్లా నుంచి వచ్చిన డీపీవో పంచాయతీల నుంచి సొమ్ములు రాబట్టేందుకు దారులు వెదుకుతున్నారని స్టాలిన్ ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు, పార్టీల నేతలు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న తరుణంలో డీపీవో మాత్రం కలెక్షన్ల పనిలో ఉన్నారన్నారు. వచ్చేనెల 13న జరిగే ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల వద్ద దివ్యాంగులు, వృద్ధులను తీసుకెళ్లేందుకు అవసరమైన వీల్‌చైర్‌ల కొనుగోలులో డీపీవో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గతంలో గ్రామాన్నిబట్టి 1, కానీ 2, కానీ 3 కొనుగోలు చేశారు. ఒకేచోట 3 పోలింగ్ బూత్‌లు ఉంటాయి. అటువంటి చోట 1, లేదా 2 వీల్‌చైర్‌లు ఉంటే సరిపోతుంది. ఈసారి లేవలేని ఓటర్లకు ఇంటివద్దకు వెళ్లి ఓటు వేయించుకునే అవకాశాన్ని కల్పించారు. అందువల్ల లేవలేని వారు, నడవలేని వారు పోలింగ్ బూత్‌ల వద్దకు రావడం తగ్గుతుంది. కొన్ని గ్రామ పంచాయతీలకు పాతవి వీల్‌చైర్లు ఉన్నాయి. అవి కాదని అన్ని పోలింగ్ కేంద్రాలకు గ్రామ పంచాయతీలతో సంబంధం లేకుండా డీపీవో కాంట్రాక్టర్‌లతో భేరం కుదుర్చుకుని, పంచాయతీల నుంచి బిల్లులు చెల్లించాలని కార్యదర్శులపై ఒత్తిడి తేవడాన్ని సర్పంచ్‌లు మండిపడుతున్నారు. ఒక్కో వీల్‌చైర్ రూ.3వేలు చేస్తే దానికి రూ.5వేలు చొప్పున బిల్లు చెల్లించాలంటూ డీపీవో ఆదేశాలు ఇవ్వడాన్ని సర్పంచ్‌లు వ్యతిరేకిస్తున్నారు. ఈ వీల్‌చైర్ల కొనుగోలు వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారే అవకాశం ఉన్నట్టు తెలుస్తుందని సర్పంచ్ స్టాలిన్ ఆరోపిస్తున్నారు. పంచాయతీలపై భారం మోపడం సరికాదని అంటున్నారు. డీపీవో పంచాయతీల తనిఖీ పేరుతో రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు డిమాండ్ చేస్తున్నారని స్టాలిన్ ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ స్టాలిన్ తెలిపారు.

● వాటినే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు

విషయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ మాధవీలత దృష్టికి తీసుకెళ్లగా వాటిని ఎక్కడైనా కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారని జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్ తెలిపారు. ఆయా పంచాయతీలకు కావాల్సిన వీల్‌చైర్లు మాత్రమే సర్పంచ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలియజేసినట్లు స్టాలిన్ అన్నారు.

రెండు వాహనాలను ఢీకొట్టిన మినీ వ్యాన్

● ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు గాయాలు

ఆలమూరు, ఏప్రిల్ 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ ఎస్ మలుపు వద్ద బుధవారం మినీ వ్యాన్ ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. తాడేపల్లిగూడెం నుంచి మండపేట వెళ్తున్న మినీ వ్యాన్ తొలుత విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. అనంతరం మలుపులో లారీని ఢీకొట్టడంతో మినీవ్యాన్ డ్రైవర్ చింతలపల్లి రాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు స్పందించి అతడిని బయటకు తీశారు. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఏడుగురు గాయపడ్డారు. బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు.



జొన్నాడ ఎస్ మలుపు వద్ద బస్సు, లారీని ఢీకొన్న మినీ వ్యాన్



ర్యాలీలో పాల్గొన్న పవన్ కళ్యాణ్, ఉదయ్ శ్రీనివాస్, కొండబాబు

కోలాహలంగా నామినేషన్లు

- జనసేన ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ నామినేషన్ దాఖలు
- ర్యాలీలో పాల్గొన్న జనసేన నేత పవన్ కళ్యాణ్

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో ఆరో రోజైన బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 143 నామినేషన్లు దాఖలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం లోక్‌సభ స్థానానికి ఎనిమిది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 45 నామినేషన్లు దాఖలయ్యాయి. కాకినాడ జిల్లాలోని కాకినాడ లోక్‌సభ స్థానానికి ఐదు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 36 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానానికి 9, అసెంబ్లీలకు 40 నామినేషన్లు దాఖలయ్యాయి.

కాకినాడ సిటీ, ఏప్రిల్ 24 : కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని తన కార్యాలయం నుంచి ఉదయ్ శ్రీనివాస్ భారీ జన సందోహంతో ర్యాలీగా బయలుదేరి జేఎన్‌టీయూకే, మెయిన్‌రోడ్, బాలాజీ చెరువు మీదుగా జిల్లా పరిషత్ సెంటర్‌కు చేరుకున్నారు. ర్యాలీలో మేళ తాళాలు, కొమ్ముడ్యాన్స్‌లు, తీన్‌మార్ డ్యాన్స్‌లతో హోరెత్తించారు. జిల్లా పరిషత్ సెంటర్ నుంచి పవన్ వెంటరాగా ఉదయ్ శ్రీనివాస్ కలెక్టరేట్‌కు నడుచుకుంటూ వెళ్లి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి వన మాడి కొండబాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నాయకులు తోట సుధీర్, బుర్ర కృష్ణంరాజు, బోళ్ల కృష్ణమోహన్, ఉండవల్లి వీర్రాజు, వరుపుల తమ్మయ్యబా బు, తెలుగుదేశం జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు. టీడీపీ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ వుండవల్లి వీర్రాజు కలెక్టరేట్ వద్ద పవన్‌కు పసుపు కండువా వేసి స్వాగతం పలికారు. ఉదయ్ శ్రీనివాస్ నామినేషన్ దాఖలు అనంతరం పవన్ కలెక్టరేట్ బయట మీడియాతో మాట్లాడారు. కాకినాడ పార్లమెంట్‌కు సునీల్ సరైన వ్యక్తి కాదని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో జనసేన కూటమి అభ్యర్థి తంగెళ్ల గెలుపు చాలా కీలకమన్నారు. అదేవిధంగా కాకినాడ సిటీ టీడీపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు గెలుపు చాలా అవసరమన్నారు. వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ఈ ప్రాంతాన్ని 4 వందల కోట్లతో అభివృద్ధి గెలుపు మాదే అంటున్నారని పవన్ వద్ద మీడియా ప్రస్తావించగా అదే వారు ఈ పాటికే 4 వందల కోట్లు కలెక్ట్ చేశారేమో చమత్కరించారు.

అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థిగా హరీష్‌మాధుర్ నామినేషన్



అమలాపురంలో నామినేష్ వేసేందుకు ర్యాలీగా తరలివెళ్తున్న హరీష్‌మాధుర్

అమలాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా గంటి హరీష్‌మాధుర్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత అయినవిల్లిలోని సిద్ధివినాయక ఆలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను స్వామివారి ముందుంచి ప్రత్యేక పూజలు జరిపారు. అమలాపురంలోని లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి ఘాట్ వద్దకు చేరుకుని తండ్రికి ఘన నివాళులర్పించారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లాకు నామినేషన్ పత్రాలు అందజేశారు.

కొత్తపేట కూటమి అభ్యర్థిగా 'బండారు' నామినేషన్



ర్యాలీలో అభివాదం చేస్తున్న సత్యానందరావు

కొత్తపేట, ఏప్రిల్ 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా బండారు సత్యానందరావు బుధవారం నామినేషన్ పత్రాలను రిటన్నింగ్ అధికారి జీవీవీ సత్యనారాయణకు సమర్పించారు. తొలుత వాడపాలెంలోని స్వగృహం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు కొత్తపేట బయల్దేరారు.

తునిలో దాడిశెట్టి రాజా నామినేషన్ దాఖలు

తుని రూరల్, ఏప్రిల్ 24: తునిలో వైసీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా 3సెట్లు దాఖలు చేయగా, ఆమె సతీమణి దాడిశెట్టి లక్ష్మి చైతన్య మరో 2 సెట్లు నామినేషన్ దాఖలు దాఖలు చేశారు. దాడిశెట్టి రాజా అఫిడవిట్‌లో ఒక క్రిమినల్ కేసుతో పాటుగా తుని పరిసర ప్రాంతాల్లో పలు వ్యవసాయభూములు, షాపింగ్ కాంప్లెక్స్‌లు,నాన్ అగ్రికల్చరల్ భూములు, బంగారం, వెండి ఆభరణా మొత్తం రూ.43.19కోట్ల ఆస్తి ఉందని చూపించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

ఆరో రోజు రెండు నామినేషన్లు



నామినేషన్లు స్వీకరిస్తున్న ఆర్వో ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆరో రోజు రెండు నామినేషన్లు అందాయని రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. మారేడుమిల్లి మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన దుమంతు విశ్వనాథం, కపిలేశ్వరపుం మండలం వడ్లమూరు గ్రామానికి చెందిన మానుపూడి సుబ్బారావు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్వో ఎ.కృష్ణజ్యోతి, తహశీల్దారు నాగరాజు, డీటీలు ఎస్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, శివ, రామకృష్ణ, చైతన్య, విశ్వనాథ్, సరిత, బాలాజీ, శ్రీధర్, రవీంద్రబాబు, వీరభద్రరావు, ఎ.సత్యనారాయణ, సీనియర్ సహాయకులు లక్ష్మణరావు, పాలుబాబు, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన సదస్సు

మోతుగూడెం, ఏప్రిల్ 24: జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వర్‌రెడ్డి, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాలతో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో వై.రామవరం మండలం బొడ్డగండి గ్రామ పంచాయతీ హంపదురు గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు 2024పై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డొంకరాయి ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. అదే విధంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది కనుక జాగ్రత్తలు వహించాలని సూచించారు. కోడ్ అతిక్రమిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మావోయిస్టుల వంటి సంఘ విద్రోహ శక్తులకు ఆశ్రయం కల్పించినా, సహాయం చేసినా నేరమని, మావోయిస్టులు దళం వంటి వారికి సహాయం చేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశం అనంతరం వాలీబాల్ కిట్ అందజేశారు. మీటింగ్‌కు హాజరైన వారికి బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్స్ కల్యాణ్, కానిస్టేబుల్స్ గంగా రాజు, పోశయ్య పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా పుస్తకాల విక్రయం?

కూనవరం, ఏప్రిల్ 24: గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ బడిలో పాఠ్య పుస్తకాలను అమ్మేసినట్లు సమాచారం. కూనవరం మండలం నరసింగపేట ఆశ్రమ పాఠశాలలో ఈ సంఘటన జరిగినట్లు తెలిసింది. రాత్రి వేళలో ట్రాక్టర్ల ద్వారా ఈ పాఠ్య పుస్తకాలను కూనవరానికి చెందిన పాత ఇనుమ షాపు యజమానాలకు అమ్మేసినట్లు స్థానికులు చెబుతున్నారు. వాటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఈ పాఠ్యపుస్తకాలను విద్యార్థులు రాసిన నోట్ బుక్‌లను టెండర్ ద్వారా పిలిచి విక్రయించాలి. పాఠ్య పుస్తకాల మాయంపై ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

కూనవరం, ఏప్రిల్24: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను మండలంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కూనవరం తహసీల్దార్ ఆర్‌వీ మురళీకృష్ణ సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఎన్నికల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు పోలింగ్ స్టేషన్ల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. సిగ్నల్స్ లేని పోలింగ్ కేంద్రాలను రన్నర్స్‌ను ఉపయోగించాలన్నారు. అధికారులు ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా మండలంలో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు.

సామూహిక పౌర్ణమి హారతి

రంపచోడవరం, ఏప్రిల్ 24: కోదండ రామాలయంలో మంగళవారం రాత్రి ఆలయ అర్చకులు యజ్ఞ సూర్యసాయికిరణ్ ఆధ్వర్యంలో సామూహిక పౌర్ణమి హారతి కార్యక్రమం నిర్వహించారు. ధర్మ ప్రచార భక్త మండలి మహిళా సభ్యులు హారతినిచ్చారు. నారాయణగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా మెట్లకు బొట్లు పెట్టి సుందరంగా అలంకరించారు. ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయ కర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవాలు పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణతో పాటు అయోధ్య నుంచి వచ్చిన బాలరాముడి ప్రసాదం వృద్ధి చేసి భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. పురోహితులు మంతా సత్యనారాయణ, అద్దంకి వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఎఫ్ జిల్లా సంయోజక్ గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అన్నవరెడ్డి కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ఆర్థిక లబ్ధి

ఎటపాక, ఏప్రిల్ 24: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక లబ్ధితో పాటు సంక్షేమ పథకాలు దరి చేరతాయని టీడీపీ జిల్లా నాయకుడు నలజాల శ్రీకాంత్ చౌదరి అన్నారు. నెల్లిపాక పంచాయతీలోని బొట్లకుంట గ్రామంలో ఆయన సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు మళ్లీ రాష్ట్రం గాడిలో పడాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. సూపర్ సిక్స్ కరపత్రాలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. రంపచోడవరం నియోజవర్గంలో టీడీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఏలూరి వెంకన్న, ఎన్టీఆర్ సేవా సమితి సభ్యులు గొర్రుముచ్చు రాము, నూకల దివ్య, నర్సింహారావు, కొర్సా రాజు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ కౌంటర్లు ఏర్పాటు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 24: ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకుని తమపరిధిలో ఓఆర్ఎస్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాల యాలతోపాటు ముఖ్యకూడళ్లలోనూ ఓఆర్ఎస్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు దీనిని వినియోగించుకో వాలని కోరారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా పీహెచ్‌సీనిగాని, తమ సమీపంలోని ఆరోగ్య కేంద్రాలనుగాని వినియోగించుకోవాలని డాక్టర్ బెనడిక్ట్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యం

● ఇంటింటా ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల





వేమగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి గోరంట్ల,
పార్టీలో చేరిన నాయకులతో గోరంట్ల

కడియం, ఏప్రిల్ 24: గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీష, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి వేమగిరి దేవీజనార్థననగర్, గొల్లలవీధి, పంచాయతీ వీధి, ముత్యాలమ్మదిబ్బ, పల్లపువీధి ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నకిలీ మద్యం సేవించి అనేక మంది మృత్యువాత పడ్డారని గోరంట్ల తెలిపారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలులేక, ఉద్యోగాల భర్తీ లేక యువత నిరుద్యోగంతో బాధపడుతున్నారన్నారు. జగన్ బటన్ నొక్కడం తప్ప.. చేసిన అభివృద్ధి లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ఏర్పడిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ప్రతీఒక్కరి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. రహదారులు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు సైకిల్ గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న నందమూరి తారకరామారావు కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓటేసి విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరపురెడ్డి జానకీరామ్, వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, గుత్తుల కృష్ణ, కొత్తూరి ముత్యాలరావు, వాసిరెడ్డి రాంబాబు, పితాని శివరామకృష్ణ, వాశంశెట్టి నాగబాబు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, గట్టి నర్సయ్య, యనమదల రాజు, దంగేటి సత్తిబాబు, గట్టి సుబ్బారావు, పాటంశెట్టి రాంజీ, కొప్పిశెట్టి రాజేష్, మాకే భూషణం, ఒంటెద్దు స్వామి, అడపా వరప్రసాద్, జంగా వినోద్, కలిదిండి గోవిందు, అల్లంపల్లి సురేష్, పరిమి మణికంఠ, కోలా శ్రీను, గళ్ళా సత్తిబాబు, బొక్కా నరేష్, అవంత్స శేఖర్, అల్లంపల్లి ప్రసాద్, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, వరగోగుల వెంకటేశ్వరరావు, ఈదుపుగంటి రమేష్, వాశంశెట్టి బాలాజీ, జోగి చక్రవర్తి, ద్రాక్షారపు వాసు, కాయల సత్యనారాయణ, తలారి మూర్తి, జల్లి కృపారావు, పిన్నింటి ఏకబాబు, ఆళ్ళ ఆనందరావు, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, ఈతకోట రాజ్‌కుమార్, మజ్జి పద్మ, ముత్యాబత్తుల విజయ, మణి తదితరులు పాల్గొన్నారు.

● వేమగిరిలో పలువురు టీడీపీలో చేరిక

వేమగిరి మాజీ ఉపసర్పంచ్ సూరపురెడ్డి జానకిరామయ్య, ఆయన సతీమణి పూర్ణిమలు బుధవారం తెలుగుదేశంపార్టీలో చేరారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ మాకే భూషణం, మాజీ ఎంపీటీసీ అల్లంపల్లి సురేష్‌లతో పాటు దుళ్ళ సత్యనారాయణ పార్టీలో చేరారు.

● రూరల్ మండలం కోలమూరులో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, వాసిరెడ్డి రాంబాబు, మజ్జి పద్మ, తాడేపల్లి నాగరాజు, దంమూడి శ్రీహరి, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, ఉండవిల్లి బంగార్రాజు, సలీమ్, బాషా, షేక్ కాశిం, సయ్యద్ ఉమర్, అలి, గోకా శ్రీను, కురుకూరి కిషోర్, మట్టా శ్రీను, బొప్పన శ్రీను, బొప్పన సతీష్, ప్రమీల, మద్దా మణి, కుమారి పాల్గొన్నారు.

కడియపులంక మాజీ సర్పంచ్, ఆమె భర్త వైసీపీకి రాజీనామా

కడియం, ఏప్రిల్ 24: కడియపులంక మాజీ సర్పంచ్ వారా పాప, ఆమె భర్త కడియపులంక సొసైటీ డైరెక్టర్, దళిత నాయకులు వారా రాము వైసీపీ పార్టీకి రాజీనామా చేశామని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక విలేకరులతో వారా రాము మాట్లాడుతూ తన భార్య గతంలో కడియపులంక సర్పంచ్‌గా పదవి చేపట్టారన్నారు. తనకు ప్రస్తుతం కడియపులంక సొసైటీ త్రీమేన్ కమిటీ మెంబర్ (డైరెక్టర్)గా పదవి ఉందన్నారు. తాను డైరెక్టర్ పదవితోపాటు, ఇరువురు వైసీపీ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

తూర్పుగోనగూడెం మాజీ సర్పంచ్‌లు మృతి

రాజానగరం, ఏప్రిల్ 24: మండలంలో తూర్పుగోనగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు గళ్లా వెంకన్న (75), పైన నాగేశ్వరరావు(65) అనారోగ్యంతో మరణించారు. గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సర్పంచ్‌లుగా విధులు నిర్వర్తించి గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. నాగేశ్వరరావు ఒక పర్యాయం సర్పంచ్‌గా ఎన్నిక కాగా, వెంకన్న రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు బుధవారం మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యం బారిన పడ్డ వెంకన్న ఆదివారం మరణించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇరువురి మృతి పట్ల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు, గ్రామ పెద్దలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

వృద్ధులకు ఆహారపదార్థాల పంపిణీ

రంగంపేట, ఏప్రిల్ 24 : భగవాన్ శ్రీసత్య సాయి బాబావారి ఆరాధన దినోత్సవం సందర్భంగా బుధవారం రంగంపేట మండలంలో గల కోటపాడు, ఈలకొలను, రంగంపేట గ్రామాల్లో శ్రీ సత్య సాయి మందిరాలలో బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలుచేసి అనంతరం వేసవి తాపాన్ని తట్టుకోవడానికి పేదలకు, వృద్ధులకు గొడుగులు, జోళ్ళు, ఆహారపదార్థాలు పంపిణీ చేశారు. ఈ సేవా సమితి కన్వీనర్లు మల్రెడ్డి వీర్రాజు,కందర్ప వెంకట అమర్నాథ్,టి.గోవింద్, ఎల్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

'ఎన్డీయే కూటమికి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు'

కోరుకొండ, ఏప్రిల్24: ఎన్డీయే కూటమికి రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి ఎమ్మార్పీఎస్ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని ఉత్తర కోస్తా ఆంధ్ర జిల్లాల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు ప్రకటించారు. బుధవారం బూరుగుపూడి టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకట రమణచౌదర, కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణలతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరిలకు తమ మద్దతు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిగ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు కూటమిఅభ్యర్థుల విజయానికి కృషి చేస్తారని చిన సుబ్బారావు పేర్కొన్నారు

రాజానగరం అభివృద్ధి బాధ్యత కూటమిదే

● కూటమి అభ్యర్థి బత్తులు, టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి

కోరుకొండ, ఏప్రిల్24: రాజానగరం పునఃనిర్మాణం, ప్రజా సాధికారచేయడం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బాధ్యత తీసుకుంటుంది కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణటీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కోరుకొండలో కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బొడ్డు పిలుపు, బత్తుల గెలుపు నినాదంతో 50వేల మెజార్టీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

ప్రజాసంక్షేమానికి చర్యలు

» అలంకరణకు, అభివృద్ధికి తేడా తెలియనివాడు రాజమహేంద్రవరానికి అవసరమా
» సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు
» ఇంటింట ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు



ప్రచారంలో ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాక ప్రజాసంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జనసేన-టీడీపీ-బీజేపీ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలోని 48వ డివిజన్‌లో బుధవారం టీడీపీ నాయకులు కానేటి ప్రభుదాస్, అజ్జరపు రమేష్, కానేటి కృపామణి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన, పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు క్యాయల రమణ, మొకమాటి సత్యనారాయణలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాల మేనిఫెస్టో, ఆదిరెడ్డి వాసు రూపొందించిన లోకల్ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కూటమి అధికారంలోకి వస్తే తామిచ్చిన వాగ్దానాలను అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఎంతగా నష్టపోయామో కొంత మంది చెప్పారన్నారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమం అంటేనే టీడీపీ అని తమ నాయకుడు చంద్రబాబు రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నగరంలో చేసిన అలంకరణను అభివృద్ధి అని చెప్పి ప్రజలను భరత్‌రామ్ మోసం చేశాడన్నారు. సుందరీకరణకు, అభివృద్ధికి తేడా తెలియనివారు మనకు అవసరమా అని ప్రశ్నించారు. అభివృద్ధి శాశ్వతంగా నిలిచి వుండాలన్నారు. అంతేగాని గాలి వానలకు కొట్టుకుపోయేలా ఉండకూడదన్నారు. ప్రజలకు ఎవరు మంచి చేశారో, ఎవరు చెడు చేశారో ప్రజలకు తెలుసున్నారు. చంద్రబాబు తయారు చేసిన సూపర్ సిక్స్ పథకాలు పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారన్నారు. పేదల కుటుంబాల్లో ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం అందించి ఉన్నత చదువులకు బాటలు వేస్తారన్నారు. నిరుద్యోగ సమస్యలను తీర్చుతారని చెప్పారు. ప్రజలకు మంచి జరగాలనే ఆలోచనతో ఉన్న కూటమిని అధికారంలోకి తీసుకురావాలని, అరాచక వైసీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆడారి లక్ష్మీనారాయణ, శ్యామల, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● కూటమితోనే అభివృద్ధి: మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాష్ట్రంలో కూటమిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమౌతుందని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. బుధవారం నగరంలో పలు చోట్ల ఆయన ప్రజలను కలిసి ప్రచారం చేశారు. ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకు రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడన్నారు. సంక్షేమం లేదు, బటన్లు నొక్కి పరదాల మాటున ఐదేళ్ల పాటు కాలయాపన చేసి పెద్ద ఏదో అభివృద్ధి చేసినట్టు ఈ రోజు బస్సుయాత్ర చేస్తున్నాడని, నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. చంద్రబాబు ఒక విజనరీ నేత అని, ఆయన ఈ రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలరన్నారు. పారదర్శకమైన పరిపాలన చంద్రబాబుకే చెల్లిందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని చెప్పారు. నిరుద్యోగులు ఈ రాష్ట్రంలో మనకు ఉద్యోగ అవకాశాలు లేవని పక్కరాష్ట్రాలకు వెళ్లిపోయారని చెప్పారు. ఇప్పుడు వారంతా కూటమి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. కోడి కత్తి డ్రామాలు, గులక రాయి డ్రామాలను నమ్మే పరిస్థితి లేదన్నారు. రాజమహేంద్రవరం ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి శ్రీనివాస్‌లు బారీ మెజార్టీతో గెలుస్తున్నారని చెప్పారు.



కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

అక్రమ లాకౌట్ ఎత్తివేయాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి పేపరు మిల్లుకు అర్థాంతరంగా లాకౌట్ ప్రకటించడం దుర్మార్గమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. ఇది కార్మికులకు ద్రోహం చేయడమేనని, తక్షణమే అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

మోనిటరింగ్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి మోనిటరింగ్ కమిటీ సమావేశాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ)లో బుధవారం సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు నిర్వహించారు. హిట్ అండ్ రన్(ఢీకొట్టి వెళ్లిపోవడం) ప్రమాద కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను కచ్చితంగా అనుసరించాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెవెన్యూ, పోలీసు అధికారులు కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. మోటారు వాహనాల చట్టం-1988, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ స్కీం-2022 నిబంధనల ప్రకారం బాధితులకు పరిహారం అందించే విధంగా కమిటీలోని ప్రతి ఒక్కరూ సహకారాన్ని అందించాలన్నారు. సమావేశంలో డివిజనల్ ఏవో ఎస్.సత్యనారాయణరాజు,ఏఎస్ఆర్ జిల్లా ఎంవీఐ ఆర్.రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

జెండా ఏదైనా అజెండా ఒక్కటే

● ఎన్డీయే బీజేపీ అభ్యర్థి నల్లమిల్లికి రామకృష్ణారెడ్డి
● అనపర్తిలో ఘన స్వాగతం

అనపర్తి, ఏప్రిల్ 24 : భారతీయ జనతా పార్టీలో చేరి అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థిగా బి ఫారమ్ అందుకుని బుధవారం అనపర్తి మండలం రామవరం చేరుకున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకు లు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పంచాయతీ సెంటర్‌కు చేరుకున్న నల్లమిల్లికి పలువురు దుశ్శాలువా పూలమాలలతో సత్కరించి స్వాగతం పలికారు. అదేవిధంగా గొల్లలమామిడాడకు చెందిన బీజేపీ నాయకులు సూర్యభగ వానుడి చిత్రపటం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్డీయే కార్యకర్తలు భారీ బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్డీయే అభ్యర్థిత్వంపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడిందన్నారు. జెండా ఏదైనా మూడు పార్టీల అజెండా ఒక్కటేనని ఎన్డీయే విజయానికి మూడుపార్టీల కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనపర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిత్వంపై జరిగిన పరిణామాలలో తమ కుటుంబం వెంట ఉండి తన ఆకాంక్షకు అనుగుణంగా కలసి నడచిన ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటానని అన్నారు. ఏది ఏమైనా ఎన్డియే విజయం సాధించాలని జగన్ రహిత ఆంధ్రప్రదేశ్ ఏర్పడాలన్న సంకల్పంతో ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, తేనెల శ్రీనివాస్, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎన్డీయే విజయానికి సమిష్టిగా పనిచేద్దాం

అనపర్తి ఎన్డీయే విజయానికి కూట మిలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు కార్యకర్త లు సమిష్టిగా పనిచేసి విజయం సాధించాలని ఎన్డీయే అనపర్తి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవా రం రాత్రి బిక్కవోలు మండలం రంగాపురం గ్రామంలో జరిగిన బీజేపీ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సీటును ఎంఎస్ ఆర్కే రాజుకు కేటాయించినప్పటికీ నియోజకవర్గంలో కూటమి విజయం సాధించాలన్న ఏకైక లక్ష్యంతో సీటు తనకు కేటాయించేందుకు ఆయన చేసిన కృషి అభినందనీ యమని అన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతామని బీజేపీ కార్య కర్తలు తమకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ యువ మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమితు లైన రాజును నల్లమిల్లి దుశ్శాలువా పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రిపూడిలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఎన్డీయే ఎన్డియే విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీడీపీ యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. రంగంపేట మండలం మర్రిపూడిలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నుంచి సుమారు 150మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు, వీరికి యువనేత మనోజ్‌రెడ్డి, జిల్లా ప్రదాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, మండల పార్టీ అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబులు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించా రు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ నియోజకవ ర్గంలో వైసీపీ దాష్టీకాలకు విరక్తి చెందిన అనేకమంది యువత టీడీపీలో చేరుతున్నారని వచ్చే ఎన్నికలలో వైసీపీ కనుమరుగు కావడం ఖాయమని అన్నారు. టీడీపీలో చేరిన వారిలో మోదుకూరి సత్తిరాజు, పుట్టా వెంకటేష్, చౌదరి, కందుకూరి శ్రీను, నూకతట్టు దండు, విజయ్‌కుమార్, ఏడిద వీరబాబు, తదితరులున్నారు.



నల్లమిల్లికి సూర్యభగవానుడి చిత్రపటం అందజేసి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు



బీజేపీ రాష్ట్ర యువమోర్చా జనరల్ సెక్రటరీగా నియమితులైన ఎమ్ఎస్ఆర్‌కు రాజును సత్కరిస్తున్న నల్లమిల్లి

జగన్ వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది

● బాబు వస్తేనే ఆంధ్రప్రదేశ్ బాగుపడుతుంది
● ఆంధ్రా పెన్షనర్ల పార్టీ రాష్ట్రాధ్యక్షుడు సుబ్బరాయన్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగన్ వల్ల తీవ్రంగా నష్టపోయిందని ఆంధ్రా పెన్షనర్ల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్, కార్యదర్శి పెదన్నగౌడ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని హోటల్ సూర్యలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. నాలుగున్న సంవత్సరాలుగా తమకు రావాల్సిన బకాయిలు ఇవ్వలేదని, మెడికల్ బిల్లులు రావడం లేదని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలేదని విమర్శించారు. చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు 72శాతం పూర్తి చేశారని, జగన్ వచ్చాక ఆ ప్రాజెక్టుకు గ్రహణం పట్టించారన్నారు. అమరావతి రాజధానిని చంద్రబాబు 76శాతం పూర్తిచేస్తే దానిని జగన్ నాశనం చేశాడన్నారు. పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లేవన్నారు. చదువుకున్న పిల్లలు ఈరోజు గంజాయి కేసుల్లో పట్టుబడడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశాడన్నారు. ఇటువంటి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నా, ప్రజలకు సుస్థిరమైన పాలన అందించాలన్నా, రాష్ట్రం బాగుపడాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ తిరుగుతూ కూటమికి మద్దతు ఇస్తోందన్నారు. ముఖ్యంగా పిల్లల భవిష్యత్తు కోసం ప్రజలు ఆలోచన చేసి కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం పార్టీ బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.సత్యనారాయణమూర్తి, కోశాధికారి టి.నాగభూషణం, సంయుక్త కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం ఎంపీ ఐదేళ్లలో చేసిందేంలేదు

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అమలాపురంలో ప్రధాన పార్టీలు సరైన అభ్యర్థులను పెట్టలేదని, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో చాలా సమస్యలు ఉన్నాయని, కాని వాటిని పరిష్కరించే సత్తా వారికి లేదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ విద్యా సంస్థల్లో బుధవారం జరిగినే విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో అక్కడ ఎంపీ ఏమీ అభివృద్ధి చేయలేదన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని గురువారం తన నిర్ణయం వెల్లడిస్తామన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు తనను కలవక పోవడానికి తాను దళితుడ్ని కావడమే కారణం కావొచ్చని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఒక ఎస్సీని తీసివేసి అగ్రవర్ణాన్ని పెట్టిందని, అప్పుడే పార్టీ మైనస్ అయ్యింది. అటుపై ఒక రెడ్డిని తీసుకువచ్చి పెట్టింది. ఇప్పుడు ఆమె తన బాబాయి హత్యకోసమే మాట్లాడుతుందన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు అప్పుడు ప్రభుత్వం సమర్థవంతంగా ఈ సంఘటన కేసులో వ్యవహరించలేదన్నారు.



ఒకనాడు ఓటుకు వెయ్యి అంటే అమ్మో అనే వారు.. మరిప్పుడో.. వైసీపీ అభ్యర్థులు ఓటుకు రూ.2500 ఇస్తారట.. ఇదీ జనం మాట.. అంత డబ్బు ఎక్కడ నుంచి వచ్చింది..! డబ్బులు ఎక్కడైనా చెట్టుకు కాస్తాయా? సంపాదిస్తే వస్తోంది.. ఐదేళ్లలో ఒక అభ్యర్థి ఓటుకు రూ.2500 ఇచ్చేలా ఎలా సంపాదించగలడంటారా!? ఇది జనమెరిగిన సత్యమే.. ఊహకు అందదు.. అంచనాలకు చిక్కదు.. ఐదేళ్లూ అందిన కాడికి తవ్వేశారు.. నేటికీ తవ్వుతూనే ఉన్నారు.. సాగని దందా లేదు.. జరగని అవినీతి లేదు..కొండలూ మాయం చేసేశారు. గోదారిని కుళ్లబొడిచేశారు. వంతెనల చెంత గుల్లగుల్ల చేసేశారు.. ఏటిగట్లూ లేపేశారు.. అఖండ దోపిడీకి అంతే లేదు.. ఐదేళ్లలో గోదావరి రూపురేఖలనే మార్చేశారు... ఎంతలా అంటే గోదావరిలో ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గోతులే..ఆ గోతుల్లో పడి చనిపోయినవారెందరో... అయినా అడ్డూ అదుపూ లేదు.. అడిగేవాడూ లేడు.. సీఎంకే ఎదురెళ్లే వాడెవడుంటాడు.. అధికారులు కిమ్మనడం లేదు.. ఇదీ గోదావరి జిల్లాల్లో జగనాసుర ఇసుక చరిత్ర.. సాక్షాత్తూ మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడే చూసి ఆశ్చర్యపోయేటంత ఇసుకను దోచేశారు.. మట్టినీ వదల్లేదు.. జగన్ ఒక్క చాన్స్ అంటే జనం అధికారమిచ్చారు.. ఐదేళ్లూ అంతా వాళ్లిష్టం..!? ఏది దొరికితే అది మింగేశారు.



ఇలా చేస్తే వంతెనలు ఉంటాయా : రాజమహేంద్రవరం ఆర్చి బ్రిడ్జి దగ్గరలో గోదావరిలో ఇసుక డ్రెడ్జింగ్





రావులపాలెం ఇసుక ర్యాంపులో తవ్వకాలు

జగన్నేతలు.. మహా మేతలు!

కాకినాడలో చెరువులు.. కొండలు ఖాళీ

పిఠాపురం, ఏప్రిల్ 24: అధికారం చేతిలో ఉంది అడిగేవాళ్లెవరు. అంతా వాళ్లిష్టమే.. ఇళ్ల స్థలాల లెవెలింగ్, ప్రభుత్వ పనుల మాటున చెరువులను అడ్డగోలుగా తవ్వేసి కొల్లగొట్టేశారు. కాకినాడ జిల్లాలోని తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో పోలవరం, పుష్కర కాలువల తవ్వకాల్లో వచ్చిన గ్రావెల్‌ను గట్లుగా వేశారు. కోట్లాది రూపాయలు విలువైన ఈ గ్రావెల్‌పై ఆయా నియోజకవర్గాల్లోని వైసీపీ నేతల కన్ను పడింది. చెరువులు, కొండలు, పోలవరం, పుష్కర కాలువల గట్లు ఇలా ఏది కనిపిస్తే వాటిపై రాబందుల్లా వాలిపోయారు. ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా తవ్వేశారు. మట్టి, గ్రావెల్ తరలించేసి కోట్లు గడించారు. ఇళ్లస్థలాల ముసుగులో గట్లను కరిగించేశారు. పోలవరం ఇరిగేషన్ అధికారులు ఈ అక్రమ తవ్వకాలపై పలు మార్లు పోలీసులకు ఫిర్యాదులు చేసినా కనీసం కేసులు నమోదు చేయలేదు. కాకినాడ జిల్లా కేంద్రానికి చెందిన ఒక కీలక నేత ఈ తవ్వకాల్లో వేయి కోట్లకు పైగా వెనుకేసుకున్నారు. ప్రత్తిపాడు, పిఠాపురం సహా మెట్ట నియోజకవర్గాల్లో కొండలు కరిగిపోయాయి. గ్రావెల్‌ను అక్రమంగా తరలించేశారు.

ఒకే ఒక్కడు.. రూ.1800 కోట్లు

జిల్లా కేంద్రమైన కాకినాడకు చెందిన వైసీపీ కీలక నేత, ఆయన అనుచరులు జిల్లాలో మట్టి, గ్రావెల్ తవ్వకాల్లో పేట్రేగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వ కీలక నేత అండదండలు పుష్కలంగా ఉండడంతో అడ్డే లేకుండా పోయింది. ఈ ఒక్క నేత మట్టి, గ్రావెల్ సంపాదనే ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు.

- పెద్దాపురం మండలం రామేశంమెట్టలో వందలాది ఎకరాల్లో వీరు అడ్డగోలుగా తవ్వేశారు. ఇళ్ల స్థలాల లెవెలింగ్ పేరుతో అనుమతి తెచ్చుకుని ఐదేళ్ల పాటు ఇష్టారాజ్యంగా గ్రావెల్‌ను తరలించి కోట్లు కొల్లగొట్టేశారు. ఈ ఒక్క తవ్వకాల్లోనే కాకినాడ కీలక ప్రజాప్రతినిధి, ఆయన అనుచరులు రూ.800 కోట్లు మేర వెనుకేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.
- పిఠాపురం నియోజకవర్గ పరిధిలోనే కాకినాడ కీలక నేత కనుసన్నల్లో చెరువులను అడ్డగోలుగా తవ్వేశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో 100 ఎకరాల విస్తీర్ణంలోని కోదండరాముడి చెరువు, చేబ్రోలులోని కోటలంకవారి చెరువు, పిఠాపురం మండలం కుమారపురం, జల్లూరు శివారులోని చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వేసి తరలించేశారు. తాటిపర్తి, చేబ్రోలు చెరువులో 20 నుంచి 40 అడుగుల మేర గోతులు పెట్టి అడ్డగోలుగా తవ్వకాలు నిర్వహించడంపై ఆయా గ్రామస్తులు, రైతులు ఆందోళనలు చేశారు. తాటిపర్తి చెరువుల్లో గోతుల్లో పడి ఇద్దరు మరణించారు. చేబ్రోలు చెరువులో అడ్డగోలు తవ్వకాలపై అక్కడి రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో తవ్వకాలపై స్టే విధించింది. తాటిపర్తి చెరువులో మాత్రం స్థానికుల ఆందోళనలు తోసిరాజని తవ్వకాలు సాగించారు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు తవ్వకాలను నిలిపివేసింది. దుర్గాడ, చెందుర్తి, సామర్లకోట మండలంలోని చెరువుల్లో తవ్వకాలు జరిగాయి. మట్టి, గ్రావెల్‌ను భారీగా తరలించేశారు.

మట్టి, చెట్లు, కాల్వగట్లు అన్నీ దోపిడీయేనా



అధికారుల తీరు చూస్తుంటే మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నట్టు ఉంది. కాల్వ గట్లు తవ్వి మట్టిని అమ్ముకుంటున్నా నిద్రావస్థలో ఉన్న అధికారులకు పట్టదు. చిత్తశుద్ధి ఉంటే తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శిక్షించాలి.
- గన్నమని సత్యనారాయణ, రైతు, దేవరపల్లి

తూర్పున గోదారంతా దోపిడీయే..

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం రూరల్/కొవ్వూరు/తాళ్లపూడి, ఏప్రిల్ 24: గోదారంతా అఖండ దోపిడీ సాగుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గోదారిలో ఇష్టానుసారంగా తవ్వేశారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక ర్యాంపులను జేపీ కాంట్రాక్టు సంస్థకు ఇచ్చినట్టు చెప్పి గతేడాది మే నుంచి డిసెంబరకు వరకు అనధికారికంగా తవ్వేసి కోట్లు దోచేసింది.తర్వాత మరోసంస్థను తెరపైకి తెచ్చి ఏకంగా బ్యారేజీ నుంచి గామన్ బ్రిడ్జి అవతలి వరకూ యథేచ్ఛగా డ్రెడ్జింగ్ చేసేస్తున్నారు. దీంతో గోదావరిపై ఉన్న రోడ్ కం రైలు వంతెన, గామన్, రైల్వే ఆర్చ్ బ్రిడ్జిలకు ముప్పు వాటిల్లనుంది. వైసీపీకి చెందిన ఒక వ్యక్తికి అఖండ గోదావరిని అప్పగించి నెలకు రూ.30 కోట్ల వరకూ కప్పం కట్టించు కుంటున్నట్టు ఆరోపణలున్నాయి.అంతకు ముందు కొవ్వూరులో ఇదే తరహా వ్యవహారం లో ప్రేమ్‌రాజ్ అనే కాంట్రాక్టర్ నెలకు రూ.30 కోట్లు కట్టలేక, ఒత్తిళ్లు తట్టుకోలేక రైలు పట్టాల పై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. అయినా దోపిడీ ఆగలేదు.బోట్స్ మన్ సొసైటీల నిర్వహించాల్సిన ర్యాంపులను స్వాధీనం చేసుకుని అక్రమ డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఓపెన్ రీచ్‌ల్లో సీతానగరం,తాళ్లపూడి, కడియం, కొవ్వూరు, పెరవలి, నిడద వోలు మండలాల పరిధిలో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. రాజమ హేంద్రవరం పరిధిలో గాయత్రి, కోటిలింగాలు, కాతేరు, వెంకటనగర్ ప్రాంతాల్లో దోపిడీకి అంతేలేదు. వైసీపీ నేతల ఒత్తిళ్లకు లొంగి అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 15 కిలోమీటర్ల మేర 30 ర్యాంపులు ఉన్నాయంటే ఎంత దారుణంగా గోదారిని కొల్లగొడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్తు హోం మంత్రి ఆదేశాలున్నాయంటూ అధికారపార్టీ నేతలు రేయింబవళ్లు యథేచ్ఛగా గోదావరి లంకల్లో ఉన్న ఇసుక, మట్టిని దోచుకుంటున్నారు. ఇటీవల కొవ్వూరు జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి నేరుగా కుమారదేవం ర్యాంపులో అక్రమంగా తరలిస్తున్న మట్టి లారీలను అడ్డుకున్నారు. తాళ్లపూడి మండలం బల్లిపాడు ఇసుక ఓపెన్ రీచ్‌లోనూ ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తు న్నారు. గోపాలపురం మండలం రాజంపాలెం పరిధిలోని దేవరకొండ గ్రావెల్ పుష్కలంగా లభించడంతో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా ఎక్స్‌కవేటర్లతో తవ్వి ట్రాక్టర్లపై తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదేళ్లూ మింగుడే

- అక్రమంగా వేల కోట్ల దోపిడీ
- ఎక్కడికక్కడ కొండలు మాయం
- ఇసుక లేకుండా గోదావరి ఖాళీ
- నేటికీ సాగుతున్న డ్రెడ్జింగ్
- ఏటిగట్లు..పోలవరం గట్లు కొట్టివేత
- ఉమ్మడి జిల్లాలో వైసీపీ దందా
- కన్నెత్తి చూడలేని అధికారులు
- ఎవరైనా వెళితే ఇక అంతే..
- అదే డబ్బుతో నేడు ఓటర్లకు గేలం




ఇక్కడ ఒకప్పుడు కొండ ఉండేదట : దాదాపుగా మాయమైన కొడవలి కొండ

కొడవలి కొండ మాయం..

గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో 370 ఎకరాల్లో విస్తరించి ఉన్న దనందిబ్బను(కొడవలి కొండ) తవ్వుకునేందుకు అనుమతులు మంజూరు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పెద్ద మంత్రి అనుచరులు ఇందులో కీలక పాత్ర పోషించారు. ఇక్కడ ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్న పేదల అభ్యంతరాలు తోసిరాజని అనుమతులిచ్చేయడం గమనార్హం. ఇక్కడే అతి ప్రాచీనమైన బౌద్ధారామం ఉంది. తవ్వకాల వల్ల బౌద్ధ ఆరామానికి నష్టం జరుగుతుందని పురావస్తుశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసినా, బౌద్ధ భిక్షువులు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. కీలక నేత అనుచరులకు స్థానిక వైసీపీ నేతలు సహకారం అందించడంతో కొడవలి కొండపై తవ్వకాలు సాగించారు. చివరకు కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేసింది.

అక్రమాల గుట్టువిప్పుతా..!



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక కొండ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు (ఫైల్)

కోనసీమంతా కొల్లగొట్టేశారు..

అమలాపురం-ఆంధ్రజ్యోతి/మండపేట/ఆత్రేయపురం/ఆలమూరు/కొత్తపేట/రావులపాలెం, ఏప్రిల్ 24: గోదారంతా దోపిడీ.. ఎక్కడా అడ్డులేదు.. అదుపూ లేదు.. గత ఐదేళ్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ పరిధిలోని గోదావరి నదీ పాయల్లో వందల కోట్ల విలువైన ఇసుక, మట్టి కొల్లగొట్టుకుపోయారు. ఈ అక్రమ దందాలో వైసీపీ ఎమ్మెల్యేలు కీలక భాగస్వాములు. ప్రధానంగా కొత్తపేట నియోజకవర్గ కేంద్రంగా వేల కోట్ల విలువైన ఇసుక, మట్టిని అనుమతులు లేకుండా తరలించుకుపోయారు. గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధ గౌతమి నదీ పాయలతో పాటు బంగాళాఖాతం సముద్ర తీరం వెంబడి ఉన్న సముద్రపు ఇసుకను సైతం కొల్లగొట్టేశారు. లంకల్లో మట్టి అయితే ప్రభుత్వ ఇళ్ల స్థలాల మెరక పేరుతో అనుమతులు పొంది ప్రైవేటు లేఅవుట్లకు తరలించి కోట్లు దోచేశారు. ప్రభుత్వానికి నామమాత్రపు ఆదాయమే చూపించేవారు. ఇందుకు కలెక్టర్ స్థాయి నుంచి వివిధ శాఖల అధికారులు సైతం వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు. ఆత్రేయపురం, రావులపాలెం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం, అల్లవరం, ఐ.పోలవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం తదితర మండలాల్లో నదీ పరీవాహక ప్రాంతాల్లో నిత్యం అక్రమ ఇసుక దందాలు నేటికీ కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారిక అనుమతులతో ప్రమేయం లేకుండా రావులపాలేనికి చెందిన ఒక కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు మట్టి, ఇసుక తరలింపు ద్వారా నెలనెలా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయంలో అధికార వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలకు భారీగా ముడుపులు ముడుతున్నాయి. జిల్లాలో ఐదేళ్లలో వెయ్యి కోట్ల పైబడి ఆదాయాన్ని ఇసుక, మట్టి మాఫియా అక్రమార్కులు ఆర్జించారనే ఆరోపణలున్నాయి. ఇసుక తవ్వకాలపై జిల్లా అధికారుల నిర్లక్ష్యంపై న్యాయస్థానాల్లో స్థానికులు ఫిర్యాదు చేశారు. పర్యావరణ అనుమతులు లేకుండా ర్యాంపులకు అనుమతులిచ్చిన తీరుపై ఎన్జీటీలో కూడా కేసు కొనసాగుతోంది. ఎర్ర గ్రావెల్ కొండలు వైసీపీ పాలనలో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. మండపేట మండలం ద్వారపూడి, కేశవరం, అనపర్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలతో పాటు రాజానగరం మండలంలో ప్రభుత్వ భూములే లక్ష్యంగా అధికార పార్టీకి చెందిన నేతలు, వారి అనుచరులు ఇళ్ల స్థలాల మెరక పేరిట కోట్లు విలువ చేసే ఎర్రకొండలను తవ్వి లారీల్లో తరలించేశారు. ఆలమూరు మండలం జొన్నాడ ఇసుక ర్యాంపులో నిబంధనలు పాటించకుండా ఇసుక తవ్వేశారు. గోదావరిలో గోతులు చెరువుల్లా మారడంతో యువత స్నానాలకు వెళ్లి మృత్యువాతపడ్డారు. ఆలమూరు జొన్నాడ వద్ద ఇసుక కొండలను జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు చూసి ఆశ్చర్యపోయారు. కొత్తపేట మండలం మందపల్లి(ఆలమూరు-2)గా ఉన్న ఇసుక రీచ్‌లో ఇసుక రవాణాకు హద్దులు..నిబంధనలను తుంగలోకి తొక్కి ఇసుక రవాణా చేశారు. పేరుకు ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో ఇసుక రవాణా చేస్తున్నామని చెప్తున్నా వైసీపీ నేతల ప్రైవేటు సైన్యంతోనే రవాణా సాగుతోంది.



బొండు ఇసుక మాయం : రావులపాలెం గోదావరిలో ఇలా

ఇసుక దోపిడీకి అడ్డేలేదు...



వైసీపీలో ఇసుక దోపిడీకి అడ్డేలేదు.. ప్రతిరోజూ లక్షలాది టన్నుల ఇసుకను తవ్వేసి అక్రమంగా ఎక్కడెక్కడికో తరలించేశారు. దీంతో గోదావరి చెంతనే ఉన్నా ఇసుక లభించడం గగనంగా మారింది.. భవన నిర్మాణ రంగ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది.
- వాదా ప్రసాదరావు, టీఎన్టీయూసీ అధికార ప్రతినిధి, మండపేట

దంపతులను మింగేశారు..



రౌతులపూడి, ఏప్రిల్ 24: వైసీపీ పాలనలో రౌతులపూడి మండలంలోని ఎస్.పైడిపాల, ఉప్పంపాలెం, మూలగపూడి, తిరుపతమ్మపేట, ఉప్పంపాలెం గ్రామాల్లో గల నల్లరాయి క్వారీలను కొల్లగొట్టేశారు. ఇష్టానుసారంగా తవ్వి పెద్దపెద్ద బండరాళ్లను విశాఖ, ఉప్పాడ, కొత్తపల్లి తదితర ప్రాంతాలకు తరలించారు. స్థానిక ఎమ్మెల్యేకు కప్పం కడితే చాలు రాయిని నచ్చినట్టు తవ్వుకొవచ్చు. వైసీపీ అక్రమ క్వారీ వ్యాపారానికి ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన దంపతులు పోలోజు వరహాలు (28), లక్ష్మీదుర్గాభవానీ మృతి చెందగా ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు.




ఎన్నికల పరిశీలకుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

ఎన్నికల పరిశీలకులను కలిసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ధవళేశ్వరం, ఏప్రిల్ 24 : జిల్లాకు వచ్చిన సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం, కమల్‌కాంత్ సరోచ్‌లను బుధవారం సాయంత్రం ధవళేశ్వరం ఇరిగేషన్ అతిథి గృహంలో కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజభరత్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.తమిళనాడుకు చెందిన కె.బాలసుబ్రహ్మణ్యం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, రాజానగరం, రాజమండ్రి అర్బన్, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన కమల్‌కాంత్ సరోచ్ కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గసాధారణ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. కలెక్టర్ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల పరిశీలన,ఈవీఎంల తరలింపు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ వంటి కార్యక్రమాలను వివరించారు.

పోలీస్ అబ్జర్వర్‌కి ఎస్పీ స్వాగతం



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనాకు ఎస్పీ జగదీశ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలి కారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలోని పోలీసు విధుల పరిశీలనకు గుజరాత్‌కు చెందిన మీనా నియమితుల య్యారు.ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరం చేరుకున్నారు.

నేటితో నామినేషన్లు ముగింపు

- ఉమ్మడి జిల్లాల్లో ఆరో రోజు 145 నామినేషన్లు
- తూర్పుగోదావరి జిల్లాలో లోక్‌సభకు 11, అసెంబ్లీకి 40
- భారీగా క్యూకట్టిన స్వతంత్ర అభ్యర్థులు..

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో ఆరో రోజైన బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి (నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరులతో కలిపి) జిల్లాలో మొత్తం 145 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో లోక్‌సభకు 24, అసెంబ్లీకి 121 ఉన్నాయి.



టీడీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థిగా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నామినేషన్ పత్రం అందజేస్తున్న బాలయోగి తనయుడు గంటి హరీశ్ మాధుర్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభకు 11, ఏడు అసెంబ్లీలకు 40 నామినేషన్లు దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానానికి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, స్వతంత్ర అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ తరపున సుంకవల్లి మురళీధరన్, వైసీపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు తరపున గూడూరి రాధిక, బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తరపున బొమ్ముల దత్తు, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ తరపున గిడుగు రుద్రరాజు, బీజేపీ అభ్యర్థి పురందేశ్వరి తరపున రేలంగి రాణిశ్రీదేవి, జైభా రత్ నేషనల్ పార్టీ తరపున సింగులూరి మోహన్ రావు, స్వతంత్ర అభ్యర్థులుగా సాలోపంతుల రాఘవేంద్ర రావు, బొమ్మనబోయిన వెంకట శ్రీరామ మూర్తి నామినేషన్లు దాఖలు చేశారు. అనపర్తి అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, బీఎస్పీ తరపున కొల్లం శ్రీను, ఇండియన్ కాంగ్రెస్ తరపున ఎల్లా శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు. రాజానగరం అసెంబ్లీ నియోజక వర్గం నుంచి నవరంగ్ పార్టీ తరపున బత్తుల బలరామకృష్ణ (పల్నాడు జిల్లా), రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థిగా కొత్తపల్లి భాస్కరరామం, జాతీయ జనపార్టీ తరపున బత్తుల బలరామకృష్ణ (కాకినాడ జిల్లా), స్వతంత్ర అభ్యర్థిగా బత్తుల వెంకటలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం సిటీ స్థానానికి జనవాహిని పార్టీ తరపున వేమన గణేష్, బీఎస్పీ అభ్యర్థిగా పరమట సురేఖ, లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థిగా వంగూరి విజయసత్య, స్వతంత్ర అభ్యర్థిగా బేతాళ వేంకటేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. రాజమండ్రి రూరల్ అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, చెల్లుబోయిన నరేన్, పిరమిడ్ పార్టీ ఇండియా తరపున వాసంతి చంద్రరావు, జై భీమ్ రావు పార్టీ తరపున గునిపే కిరణ్‌కుమార్, భారత చైతన్య యువజన పార్టీ తరపున దుగ్గిరాల శ్రీదేవి, చల్లంగి నాగేశ్వరరావు నామినేషన్లు దాఖలుచేశారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండియన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరిగెల అరుణకుమారి తరపున గెడ్డం సాయిబాబు, లిబరేషన్ కాంగ్రెస్ తరపున బొంతా శ్యామ్‌రవిప్రకాష్, వైసీపీ తరపున తలారి వెంకట్రావు, టీడీపీ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున మద్దుల వీర వెంకట సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా తాతపూడి సుజయ్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్లు సమర్పించారు. నిడదవోలు అసెంబ్లీ నుంచి వైసీపీ తరపున జి.శ్రీనివాసనాయుడు, ఇండియన్ కాంగ్రెస్ తరపున పెద్దిరెడ్డి సుబ్బారావు, జైభారత్ నేషనల్ పార్టీ తరపున పులమాల వీరభద్రం, జనసేన తరపున కృష్ణతేజ, స్వతంత్ర అభ్యర్థులుగా అరిగెల సత్య వరప్రసాద్, కృష్ణతేజ నామినేషన్లు దాఖలు చేశారు. గోపాలపురం నుంచి వైసీపీ అభ్యర్థిగా తానేటి వనిత తరపున ఒక సెట్ నామినేషన్ వేశారు. జైభారత్ పార్టీ అభ్యర్థిగా ములగాల శ్రీనివాసరావు, జాతీయ జనసేన పార్టీ తరపున పెనుమాక వెంకటరత్నం, స్వతంత్ర అభ్యర్థులుగా రాపాక హరికృష్ణ, ముక్కవల్లి వెంకటరమణ, గెడ్డం ఆనందబాబు, దారాబత్తుల వీరేంద్ర విజయ్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. పలువురు అభ్యర్థులు ర్యాలీగా తరలివచ్చారు. కాగా గురువారంతో నామినేషన్ల ప్రక్రియ ముగియనున్నది.



పేపరుమిల్లు ఎదుట గుమిగూడిన కార్మికులు

ఏపీ పేపర్‌మిల్లు లాకౌట్

రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు యాజమాన్యం బుధవారం రాత్రి లాకౌట్ ప్రకటించింది. పేపరుమిల్లు కార్మికులు గత 20 రోజుల పైబడి న్యాయపరమైన డిమాండ్స్ సాధనకు సమ్మె చేస్తున్నారు.. డిమాండ్స్ ఒప్పుకునే వరకు సమ్మె విరమించబోమని జేఏసీ స్పష్టం చేసింది. ఈ మేరకు యాజమాన్యం బుధవారం రాత్రి లాకౌట్ నోటీసును మిల్లు నోటీసు బోర్డులో పెట్టింది. - వివరాలు 8లో

మేం వస్తే.. పెన్షన్ రూ.4 వేలు





ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది.. ఎండను సైతం లెక్కచేయక అభ్యర్థులు ఓటర్లతో మమేకమవుతున్నారు.. సమస్యలు వింటూ.. మీకు మేమున్నామంటూ ముందుకు సాగుతున్నారు.. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్.. రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి వృద్ధులకు మేమున్నాం.. మీ పింఛన్ రూ.4 వేలకు పెంచుతాం అంటూ బుధవారం ఇలా భరోసా ఇచ్చారు.

మోటారు మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గేష్





మెకానిక్‌ల ఆత్మీయ సమావేశంలో దుర్గేష్, పట్టణంలో ప్రచారం

నిడదవోలు, ఏప్రిల్ 24: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మోటారు మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులో బుధవారం జరిగిన టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లా డారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మెకానిక్‌ల వారి సంక్షేమానికి, అభివృద్ధికి బాధ్యత తీసుకుంటానన్నారు. ఇదిలా ఉండగా నిడదవోలులోని 1,2,28 వార్డుల్లో దుర్గేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి వీధిలోను మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయమంటే దాచుకోవడం, దోచుకోవడం కాదని ప్రజలకు సేవచేయడమని, ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందించ గల సమర్థత కూటమి ప్రభుత్వానికే ఉందన్నారు. కార్యక్రమాల్లో కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, బాలు, నాగరాజు, రాజేష్, డాక్టర్ తోపరాల కళ్యాణ్‌చక్రవర్తి, కారింకి నాగేశ్వరరావు, బండి సత్యనారాయణ, తిరుపతి సత్యనారాయణ, నీలం రామారావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరులో ప్రచారం నిర్వహిస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 24: రాష్ట్రాభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరులోని దగ్గువారి రామాలయం వీధి, రాయుడు ఆసుపత్రి వీధి, 22, 23, 2వ వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అలాగే టీడీపీ మినీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్, మెగా డీఎస్సీ, పింఛను రూ.4 వేలకు పెంపు, వలంటీర్ల వేతనం రూ.10 వేలకు పెంపు వంటి పథకాలను ప్రచారం చేశారు. ముప్పిడి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకుని అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కి నెట్టేశారన్నారు. కార్యక్రమంలో దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బీవీ ముత్యాలరావు, కె.నవ్య, అర్లిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాలకు మేలు

గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మార్టిన్ లూథర్

దేవరపల్లి, ఏప్రిల్ 24: కేంద్రం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని నియోజకవర్గ అభ్యర్థి మార్టిన్ లూథర్ అన్నారు. దేవరపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందన్నారు. గురువారం ఉదయం 11గంటలకు గోపాలపురంలో నామినేషన్ దాఖలు చేస్తామని, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వెలగా రామకృష్ణ, జ్యేష్ట సతీష్‌బాబు, కాకర్ల శ్రీహరిబాబు, విల్లూరి రమేష్, గన్నమని రామారాయుడు పాల్గొన్నారు.

తాళ్లపూడి/కొవ్వూరు: తాళ్లపూడి మండలం అన్నదేవరపేట, కొవ్వూరులోని 1, 2 వార్డులు, ఆరికిరేవుల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి అరిగెల అరుణకుమారి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరించారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయాలన్న రాజశేఖరరెడ్డి కల సాకారం కావాలంటే అందరూ కాంగ్రెస్ పార్టీ ఓటు వేయాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో పోసిన విశ్వనాథపటేల్, పోసిన నారాయణరావు, ఇంజరపు బాబీ, పచ్చా వెంకటేశ్వరరావు, పచ్చారవి, గెడ్డం సాయిబాబా, కొణిదెల శ్రీనివాస్, గంధం పూజ్య నరసింహ బాపూజీ, పాలకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆవపాడులో తీరని తాగునీటి సమస్య

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం



నల్లజర్ల, ఏప్రిల్ 24: మండలంలోని ఆవపాడులో నెలలు గడుస్తున్నా తాగునీటి సమస్యలు తీరడం లేదు. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు మంచి నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి 17న ఆవపాడులో తాగునీటి కష్టాలు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి పత్రికలో ఓ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన విద్యుత్ అధికారులు త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకూ పంచాయతీ తాగునీటి మోటార్‌కు కనెక్షన్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు మొరపెట్టుకుంటుంటే మూడు నెలల సమయం తీసుకుని ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఏర్పాటు చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ జనసేన సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ సొంత నిధులతో మరో ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి కొత్తపేట పైపులైన్‌కు మరో పైపులైన్‌ను అనుసంధానం చేసి ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. వేసవి దృష్ట్యా ఒకే మోటార్‌పై గ్రామం అంతటికీ నీరు అందించడం సాధ్యమయ్యే పనికాదని ప్రజలు వాపోతున్నారు. మరో మోటార్‌కు కనెక్షన్ ఇస్తే ప్రజలకు కావలసినన్ని నీరు అందించవచ్చని గ్రామస్థులు భావిస్తున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నల్లజర్ల, ఏప్రిల్ 24: నల్లజర్లలో జరగబోయే బాల్య వివాహాన్ని చైల్డ్ ప్రొటెక్షన్, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా అడ్డుకున్నారు. నల్లజర్లలోని ఓ బాలికకు బుధవారం సాయంత్రం వివాహం జరిపించేందుకు నిశ్చయించారు. సమాచారం తెలుసుకున్న అధికారులు బుధవారం బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. బాల్య వివాహం వల్ల కలిగే ఇబ్బందులను తెలియజేశారు. దీంతో బాలిక మేజర్ అయ్యే వరకు పెళ్లి చేయబోమని అధికారులకు బాలిక తల్లిదండ్రులు, బంధువులు హామీపత్రం ఇచ్చారు.చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యుడు క్రాంతికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, మహిళ పోలీసు సౌజన్య, అంగన్‌వాడీ టీచర్ శివకుమారి పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



నల్లజర్ల, ఏప్రిల్ 24: నల్లజర్ల బస్టాండ్ వద్ద భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. భజన మండలి సభ్యులు శ్రీరామ నామం, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తిన సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కోడూరి నారాయణ, వల్లూరి రామకృష్ణ, గన్నిన శివన్నారాయణ, సవలం రామకృష్ణ, నాదెళ్ల శ్రీరామ్, మండ సురేష్, అజేయ్ పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యంతోనే పోలింగ్ శాతం పెంపు

చాగల్లు, ఏప్రిల్ 24: ఓటర్లలో చైతన్యం కలిగించడం ద్వారా పోలింగ్ శాతం పెంచవచ్చునని నియోజకవర్గ ఎన్నికల సహాయ అధికారిణి, తహశీల్దార్ ఎం.సావిత్రి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓటర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాబోయే సాధారణ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.బుజ్జి, ఆర్ఐ నాగేశ్వరరావు, భాస్కర్, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పడిందా..ప్రాణం గోవిందా!

- లారీల్లో యథేచ్ఛగా బండరాళ్ల తరలింపు
- నిబంధనలు తుంగలోకి తొక్కి రవాణా
- ఎప్పుడు జారి పడతాయోనని స్థానికుల్లో ఆందోళన





గౌరీపట్నంలో అధికలోడుతో క్వారీ బండరాళ్లు తరలిస్తున్న లారీలు

దేవరపల్లి, ఏప్రిల్ 24: ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా క్వారీ బండరాళ్లను లారీలపై తరలిస్తున్నారు. దేవరపల్లి మండలంలోని గౌరీపట్నం, దుద్దుకూరు, లక్ష్మీపురం, పంగిడి, చాగల్లు పరిధిలో ఉన్న క్వారీల నుంచి బండరాళ్లను క్రషర్లకు తరలిస్తుంటారు. పరిమితికి మించి ఈ బండరాళ్లు లోడు వేసి జారిపడే విధంగా వెళ్తుండడంతో పాదచారులు, వాహనచోదకులు, భయభ్రాంతులకు గురవుతున్నారు. క్వారీ బండరాళ్ల తరలించే లారీలు రేయింబవళ్లు తిరుగుతుంటాయి. నిత్యం వేలాది వాహనాలు వెళ్తుండడంతో ఈ రాళ్లు ఎక్కడ మీదపడతాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీమాత ఆలయం ఉండడం, రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ పాఠశాల, కాలేజీ ఉన్నాయి. ప్రతి రోజు వందల సంఖ్యలో భక్తులు మేరీమాత ఆలయానికి వస్తుంటారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో అధికలోడుతో బండరాళ్లు వెళ్తుండడంతో ఎక్కడ జారి మీదపడతాయోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో రాళ్లు పడి పలువురు చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ రాళ్లు లారీల నుంచి కిందపడినప్పుడు వాహనచోదకులు గమనించక ముందుకు వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసు అధికారులు క్వారీ, లారీ యజమానులకు సమావేశాలు నిర్వహించి పరిమితికి మించి లోడు వేసి రవాణా చేయొద్దని చెప్పినప్పటికీ, వాహనాలు ఆపి కేసులు నమోదు చేసినప్పటికీ కొద్దిరోజులు మానేసి మరలా యథేచ్ఛగా అధిక లోడులతో లారీల్లో రాళ్లు తరలిస్తున్నారు. గౌరీపట్నంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి అధిక లోడు లారీలను నియంత్రించి ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నామినేషన్ల స్వీకరణ పరిశీలన

పలు అంశాలపై సబ్‌కలెక్టర్‌తో చర్చించిన ఎన్నికల పరిశీలకుడు కమలకాంత్ సరోచ్



కమలకాంత్‌కు ఎన్నికల ఏర్పాట్లను వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీవాస్తవ

కొవ్వూరు, ఏప్రిల్ 24: కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ స్వీకరణ కార్యక్రమాన్ని కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమలకాంత్ సరోచ్ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొవ్వూరు నియోజకవర్గంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించడానికి బుధవారం ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన ఆయనకు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ స్వాగతం పలికారు. అభ్యర్థుల ప్రచారం, కోడ్ ఉల్లంఘన, అనుమతులు వంటి అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో అభ్యర్థుల నామినేషన్లు స్వీకరణ, ఎన్నికల ప్రచార అనుమతులు, పోలింగ్ నిర్వహణకు చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలను సబ్‌కలెక్టర్ వివరించారు.

కొవ్వూరులో ఐదు నామినేషన్ల దాఖలు

కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బుధవారం ఐదు నామినేషన్లు స్వీకరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా తాతాపూడి సుజయ ప్రవీణ్‌కుమార్ రెండో సెట్ నామినేషన్ అందజేశారు. కొవ్వూరుకు చెందిన బొంతా శ్యాం రవి ప్రకాష్ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరిగెల అరుణకుమారి తరపున రెండో సెట్ నామినేషన్‌ను ఆ పార్టీ నాయకులు గెడ్డం సాయిబాబా, గంధం బాపూజీ అందజేశారు. టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున మూడో సెట్ నామినేషన్‌ను పార్టీ నాయకులు మద్దుల సత్యనారాయణ, అనుపిండి చక్రధరరావు అందజేశారు. వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు మూడో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు.



మూడో సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి

నిడదవోలులో 6 నామినేషన్ల స్వీకరణ

నిడదవోలు, ఏప్రిల్ 24: నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రమణనాయక్‌కు పలు పార్టీల తరపున ఆరు అసెంబ్లీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జై భారత్ నేషనల్ పార్టీ తరపున పులమల వీరభద్రం, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున పెద్దిరెడ్డి సుబ్బారావు, స్వతంత్ర అభ్యర్థులుగా అరిగెల సత్య వరప్రసాద్, కృష్ణతేజ, వైసీపీ తరపున గెడ్డం శ్రీనివాస్ నాయుడు, జనసేన పార్టీ తరపున కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ నామినేషన్లను స్వీకరించినట్టు అధికారులు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



కొవ్వూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న అచ్చిబాబు

- తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు
- పలుచోట్ల టీడీపీ-జనసేన-బీజేపీ నాయకుల ప్రచారం
- బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాల అందజేత

కొవ్వూరు, ఏప్రిల్ 24: కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొవ్వూరు మండలం ధర్మవరంలో ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. గ్రామంలోని నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం బాబును మళ్లీ రప్పిద్దాం, రాష్ట్రాభివృద్ధికి సహకరిద్దామంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్‌గుర్తుపై, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గారపాటి వెంకటకృష్ణ, వెంపాటి యుగంధర్, కడిమి శ్రీనుబాబు, కాపకాయల సతీష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని సూరయ్యపేటలో టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కొరారు వెంకట్రావు, ఖైనం గంగరాజు, నరుకుర్తి శ్రీను, ఇంజరపు అబ్బులు, ఎలుబంటి నరసయ్య, బాలకృష్ణ, ముళ్లపూడి రామచంద్రం పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు, గన్నమని హరికృష్ణ పలువురు కార్యకర్తలు, మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జనసేన-టీడీపీ-బీజేపీ మేనిఫెస్టోలను, సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజును, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీసీ కాలనీలో కృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గద్దే సుబ్రహ్మణ్యం, యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాంబాబు, యాగంటి శ్రీనివాస్, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, యాగంటి సాయిబాబు, చింతపల్లి నాగమణి, పాముల భూదేవి పాల్గొన్నారు.

గోపాలపురం/దేవరపల్లి: గోపాలపురం మండలం వాదాలకుంట, దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయిగూడెం, గాంధీనగరం, సంగాయిగూడెం, యర్నగూడెం గ్రామాల్లో జనసేన-టీడీపీ-బీజేపీ ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేదని, తన సంపాదనపై దృష్టి పెట్టారని అన్నారు. దళిత యువకుడి మృతికి కారణమైన హోంమంత్రి వనితను ప్రజలు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న శ్మశాసన భూముల సమస్యను తాము అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులందర్నీ గెలిపించాలన్నారు. మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందించేందుకు మే 13న ప్రజలంతా ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాదాలకుంటలో వైసీపీకి చెందిన పదిమంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి మద్దిపాటి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇటీవల గ్యాస్ ప్రమాదంలో మృతి చెందిన నక్కా నిర్మల కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు, టీడీపీ మండలాధ్యక్షులు రొంగలి సత్యనారాయణ, ఆండ్రూ అనీల్, జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు, కొయ్యలమూడి చినబాబు, జీఎం అజిత్‌కుమార్, కొయ్యలమూడి సుధారాణి, పెనుమత్స సుబ్బురాజు, గద్దే వెంకట్రామారావు, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గోపాలపురం: వాదాలకుంటలో రోడ్‌షోలో పాల్గొన్న పురందేశ్వరి, మద్దిపాటి

సామాన్యుల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్

- రాజమహేంద్రవరం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



ఆంధ్రా పేపర్ మిల్లు వద్ద కార్మికులతో మాట్లాడుతున్న రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24: సామాన్య ప్రజల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని రాజమహేంద్రవరం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో పర్యటించారు. సిటీ అభ్యర్థి బోడా వెంకట్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్మికులు, కర్షకులు, కూలీలు, చిరువ్యాపారులు, మహిళను కలిసి 9 గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడారు. ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వాలు ప్రజలను నమ్మించి మోసం చేశాయన్నారు. నిరుద్యోగ సమస్య తాండవిస్తోందన్నారు. రాష్ట్రం పూర్తిగా వెనకబడిపోయిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప మరేమి జరగలేదన్నారు. దేశంలో సుస్థిరమైన పాలన, రాష్ట్రంలో అభివృద్ధి, విభజన హామీలు అమలు చేసేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు.

● పేపరుమిల్లు కార్మికులకు మద్దతు

రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపరుమిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించిన విషయం తెలుసుకున్న ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్ పేపరుమిల్లు వద్దకు చేరుకుని కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికులు చేసే పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుదన్నారు. కార్మికుల కోసం దేనికైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. మిల్లు యాజమాన్య తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఎన్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని కార్మికులకు మద్దతు ప్రకటించారు.

లాకౌట్ ప్రకటించిన ఆంధ్రా పేపరు మిల్లు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24: రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు యాజమాన్యం బుధవారం రాత్రి లాకౌట్ ప్రకటించింది. పేపరుమిల్లు కార్మికులు గత 20 రోజుల పైబడి తమ న్యాయపరమైన డిమాండ్స్ సాధన కోసం సమ్మె చేస్తోంది. ఈ క్రమంలో గతంలోనే యాజమాన్య ప్రతినిధులకు, కార్మిక సంఘాలకు మధ్య జాయింట్ లేబర్ కమిషనర్ సమక్షంలో సమావేశాలు జరిగాయి. యూనియన్ల గుర్తింపులను రద్దు చేయి ంచే ప్రయత్నంలో భాగంగా యాజమాన్యం కోర్టుకు వెళ్లడం, అగ్రిమెంట్ విషయంలో కార్మికుల వాదనను యాజమాన్యం పట్టించుకోలేదు. దీంతో 11 కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి సమ్మెలోకి వెళ్లారు. అయినా యాజమాన్యం పట్టించుకోలేదు. రెండుమూడు పర్యాయాలు కార్మికులను విధులకు హాజరుకావాలని యాజమాన్యం కోరింది. న్యాయపరమైన డిమాండ్స్ ఒప్పుకునేవరకు సమ్మెవిరమించమని జేఏసీ స్పష్టం చేసింది. యాజన్యం బుధవారం రాత్రి లాకౌట్ నోటీస్‌ను మిల్లు నోటీసు బోర్డులో పెట్టింది. దీంతో కార్మికులు యాజమాన్యం, హెచ్‌ఆర్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదని కార్మిక జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

తీపర్రులో టీడీపీ కార్యాలయం

పెరవలి, ఏప్రిల్ 24: సాధారణంగా పార్టీ కార్యాలయాలు రాష్ట్ర స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ నియోజకవర్గాల స్థాయిలో ఉంటాయి. మండల స్థాయిలో కూడా అక్కడక్కడ అరుదుగా ఉంటాయి. గ్రామ స్థాయిలో ఎన్నికల సమయంలో తాత్కాలికంగా పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. అందుకు విరుద్ధంగా తీపర్రులో టీడీపీ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు కలిసి శాశ్వతంగా ఉండేలా టీడీపీ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో సుమారు 200 మంది పట్టే విధంగా ఈ కార్యాలయాన్ని నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో ఈ ఎన్నికలతోపాటు రాబోయే అన్ని ఎన్నికలకు ఇదే పార్టీ కార్యాలయాన్ని ఉపయోగించుకుంటామన్నారు. బుధవారం మంచి రోజు కావడంతో కార్యాలయాన్ని ప్రారంభించినట్టు చెప్పారు.

ఖేలో ఇండియాలో నాణ్యమైన నిర్మాణాలు

నన్నయ ఉపకులపతి ఆచార్య పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 24: ఖేలో ఇండియాలో మంజూరైన నిధులను విడుదల చేసి నాణ్యమైన నిర్మాణాలను అందజేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు కోరారు. నన్నయ వర్సిటీలో ఖేలో ఇండియా పనులను పరిశీలించేందుకు బుధవారం వచ్చిన ఖేలో ఇండియా ప్రాజెక్టు మోనిటరింగ్ కమిటీ బృందం వీసీతో సమావేశమైంది. ఈ సందర్భంగా వీసీ వినతిపై సానుకూలంగా స్పందించిన బృందం ప్రస్తుతం పరిశీలించిన నిర్మాణ పనులపై నివేదిక సమర్పించి మంజూరైన నిధులు విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామని పేర్కొంది. ఖేలో ఇండియా నిధులు రూ.8.30 కోట్లతో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ పనులను మోనిటరింగ్ కమిటీ చైర్మన్ పి.రామకృష్ణ, శాప్ సభ్యుడు రజత్‌చౌహాన్, స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి పి.సతీష్‌కుమార్, శాప్ అధికారి ఎస్‌వీరమణ, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇంజనీర్ కె.నూకరత్నంలతో కలిసి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ యూనివర్శిటీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయని వీసీ అన్నారు. గోదావరి జిల్లాల్లోని క్రీడాపోటీలకు జాతీయస్థాయి వేదికలుగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా డీఎస్‌డీవో డీఎం ఎం.శేషగిరి, విశ్వవిద్యాలయం క్రీడాబోర్డు అధ్యాపకులు పాల్గొన్నారు.

లాకౌట్ ఎత్తివేయాలి : ఏఐటీయూసీ

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి పేపరు మిల్లుకు అర్ధాంతరంగా లాకౌట్ ప్రకటించడం దుర్మార్గమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. ఇది కార్మికులకు ద్రోహం చేయడమేనని, తక్షణమే అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మిల్లులో పనిచేస్తున్న 2,800 మంది పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు నూతన వేతన ఒప్పందం, గుర్తింపు సంఘ ఎన్నికల కోసం 13 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం కార్మికశాఖ జాయింట్ కమిషనర్, జిల్లా కలెక్టర్ సమక్షంలో చర్చలు జరిగినప్పటికీ యాజమాన్యం మొండి పట్టుదలకు పోయిందని ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

చాగల్లు, ఏప్రిల్ 24: చాగల్లు పంచాయతీ పరిధిలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ఎన్.బుజ్జి బుధవారం పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అర్హులందరికీ పని కల్పించేలా బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

పంచాయతీలను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి నరేంద్రబాబు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 24: పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు, విధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు ఆరోపించారు. బుధవారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా తాడిపర్రు పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు ఇవ్వక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. దేశానికి వెన్నుముక పంచాయతీలేనని, పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అక్కిన రత్నం, గారపాటి సత్యనారాయణ, దుర్గాప్రసాద్, జి.వెంకటచిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో వాహన తనిఖీలు

పెరవలి, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలపై ఎటువంటి ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లరాదని పెరవలి ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారి రమేష్ పేర్కొన్నారు. నిడదవోలు-నరసాపురం రోడ్డులో, కాకరపర్రు, తీపర్రు రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప నగదు వెంట తీసుకెళ్లరాదని తప్పనిసరి పరిస్థితిలో తీసుకెళితే ఆధారాలతో రావాలని పేర్కొన్నారు. అనుమానాస్పదంగా ఉన్న సివిల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ఉండ్రాజవరం, ఏప్రిల్ 24: కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ కుమార్తె రంగప్రియ బుధవారం ఉండ్రాజవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్రం, దేశం అభివృద్ధికి ఎన్డీయే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అసెంబ్లీకి గ్లాసు గుర్తు, పార్లమెంటుకు కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, కుదప చక్రపాణి పాల్గొన్నారు.

పెరవలి: ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావుల బుధవారం నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ అసమర్థ విధానాలను తరిమి కొట్టడానికి అందరూ నడుం బిగించి రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన కోఆర్డినేటర్ భోగవల్లి ప్రసాద్, రవి వర్మ, అతికాల శ్రీను, పిప్పర రవి, అబ్బిశెట్టి సత్తిరాజు, నల్లాకుల వెంకటేశ్వరరావు, కోలా బుల్లి శ్రీను, బండారు వెంకటరమణ, సాయిబాబా, మారిశెట్టి పోతురాజు, మానికిరెడ్డి మురళీ కృష్ణ, కోటిపల్లి మురళీ కృష్ణ పాల్గొన్నారు.

గోపాలపురంలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

గోపాలపురం, ఏప్రిల్ 24: సాధారణ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన గోపాలపురంలో ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రాన్ని తహశీల్దార్ వనజాక్షి, దేవరపల్లి సీఐ బాలసురేష్ బాబు, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. తహశీల్దార్ మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ తహశీల్దార్ ఎస్.కృష్ణ ఉన్నారు.

గోపాలపురంలో నాలుగు నామినేషన్లు

గోపాలపురం, ఏప్రిల్ 24: గోపాలపురం నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానానికి ఏడో రోజు నాలుగు నామినేషన్లు దాఖలైనట్టు రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ తరపున తానేటి వనిత 3వ సెట్ నామినేషన్ దాఖలు చేశారని, స్వతంత్ర అభ్యర్థులుగా రాపాక హరీష్‌కుమార్, నక్కవల్లి వెంకటరమణ నామినేషన్లు వేశారన్నారు. జైభారత్ పార్టీ నుంచి మునగాల శ్రీనివాసరావు ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్టు ఆర్‌వో తెలిపారు.